www.bhadradrinews.com

# భద్రాద్రి న్యూస్

తెలుగు దినపత్రిక

Bhadradrinews Telugu Daily

హైదరాబాద్, సంపుటి : 4 సంచిక: 37 సోమవారం 2-3-2026 | ఎడిటర్ : చెంగపొంగు సైదులు | పేజీలు : 6 వెల : 5

Published from Khammam,Circulated by Hyderabad, Karimnagar, adilabad, Nizamabad, Warangal, Nalgonda, Mahabubnagar, Khammam

15లోపు పట్టాలిస్తాం..
ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తాం!



4లో..

న్యాయవాదులకు తెలంగాణ ప్రభుత్వం అండగా ఉంటుంది




5లో

# ఖమేనీ మృతితో ఇరాన్ బాంబుల వర్షం



ఇరాన్ క్షిపణి దాడుల్లో ఇజ్రాయెల్‌లో ధ్వంసమైన ఓ భవనం

## ఇజ్రాయెల్, పశ్చిమాసియాలోని అమెరికా స్థావరాలపై ఎడాపెడా దాడులు


ప్రతీకారేచ్ఛతో రగిలిపోతున్న ఇరాన్

## సుప్రీం లీడర్ మృతికి కచ్చితంగా బదులు తీర్చుకుంటామని హెచ్చరిక



**టెహ్రాన్ :** అమెరికా- ఇజ్రాయెల్ జరిపిన భీకర దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ చర్యను ఇరాన్ తీవ్రంగా పరిగణించింది. కచ్చితంగా బదులు తీర్చుకుంటామని హెచ్చరించింది. ఖమేనీ మృతికి సరైన సమాధానం చెప్పకుండా వదిలిపెట్టేది లేదని ఇరాన్ క్యాబినెట్ పేర్కొంది. ఖమేనీ మృతిపై ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ సంతాపం తెలిపింది. తమ సుప్రీం నేతను చంపిన వారికి కఠిన శిక్ష విధిస్తామని.. చరిత్రలో ఎన్నడూ చూడని భయంకరమైన దాడులు ఏ క్షణాల్లోనైనా జరగొచ్చని హెచ్చరించింది. ఇజ్రాయెల్, యూఎస్ స్థావరాల లక్ష్యంగా భారీ ఆపరేషన్ చేపట్టేందుకు ఐఆర్‌జీసీ సిద్ధమైనట్లు అక్కడి మీడియా వెల్లడించింది. ఇక, అమెరికా- ఇజ్రాయెల్ దాడుల్లో ఖమేనీ కీలక సలహాదారులు అలీ షంఖానీతో పాటు ఐఆర్‌జీసీ చీఫ్ మహమ్మద్ పాక్‌పౌర్ ప్రాణాలు కోల్పోయారని తాజాగా ఇరాన్ ధ్రువీకరించింది. ఈ క్రమంలో ఐఆర్‌జీసీ తన కొత్త కమాండర్-ఇన్-చీఫ్‌ను నియమించింది. మాజీ రక్షణ మంత్రి అహ్మద్ వాహిదీకి ఆ బాధ్యతలు అప్పగిస్తున్నట్లు ప్రకటించింది. తమ సుప్రీం లీడర్ ఖమేనీ మృతి నేపథ్యంలో ఇరాన్ తీవ్రంగా స్పందించింది. తాజాగా పశ్చిమాసియాలోని 27 అమెరికా సైనిక స్థావరాలే లక్ష్యంగా క్షిపణులు, మిగతా 2లో..

## దాడులు ఆపకపోతే తీవ్రపరిణామాలు



- కనీవినీ ఎరుగని భీకరశక్తితో ఇరాన్‌పై దాడిచేస్తాం..ట్రంప్ హెచ్చరిక
- 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ'ని స్వయంగా పర్యవేక్షించిన అమెరికా అధ్యక్షుడు

2లో..

## తెలంగాణ బిడ్డలు అప్రమత్తంగా ఉండండి

- అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దు
- గల్ఫ్‌లో ఉద్రిక్తతల నేపథ్యంలో సీఎం రేవంత్ సూచన

## అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘన

ఖమేనీ మృతిపై పుతిన్ సంతాపం

ఖమేనీ పగ్గాలు ముగ్గురు సభ్యుల

## కౌన్సిల్ చేతికి

కొత్త వారసులను ప్రకటించిన ఇరాన్ అధికారిక మీడియా



2లో..

ప్రతిపక్షాలు చిల్లర రాజకీయాలు చేయకుండా

## సంయమనం పాటించాలి

**వెలుగుమట్లలో పేదలకు 15లోపు ఇళ్ల స్థలాలతోపాటు రూ.5 లక్షలు దగ్గరుండి ఇప్పిస్తా**

- పేదలను అడ్డుపెట్టుకొని రాజకీయం చేయొద్దు
- ఖమ్మం భూదాన్ భూములపై ఆధారాలతోనే మాట్లాడుతున్నాం
- అధికారులు తప్పు చేసి ఉంటే కఠిన చర్యలు తీసుకుంటాం:మంత్రి పొంగులేటి

**ఖమ్మం :** ఖమ్మం నగర శివారులోని వెలుగుమట్లలో అర్హులైన పేదలకు ఈ నెల 15లోపు ఇళ్ల స్థలాలతోపాటు రూ.5 లక్షలు దగ్గరుండి ఇప్పిస్తానని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. అధికారులు తప్పు చేసి ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతిపక్షాలు చిల్లర రాజకీయాలు చేయకుండా సంయమనం పాటించాలని అన్నారు. ఖమ్మంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖమ్మం భూదాన్ భూములపై ఆధారాలతోనే మాట్లాడుతున్నట్లు చెప్పారు. పేదలను అడ్డుపెట్టుకొని రాజకీయం చేయవద్దని హితవు పలికారు. వెలుగుమట్ల గ్రామ సర్వే నంబర్లు 147, 148, 149లోని భూదాన్ భూముల్లో పలువురు ఇళ్లు నిర్మించుకోగా.. సీసీఎల్ఏ, హైకోర్టు ఆదేశాలతో ఈ నెల 24న అధికారులు 652 పైగా ఇళ్లను తొలగించారు. భూదాన్ యజ్ఞ బోర్డు, రెవెన్యూశాఖ విచారణలో నకిలీపత్రాలు, అక్రమ కేటాయింపులు మిగతా 2లో..



## ఖమ్మంలో దౌర్జన్యంగా పేదల ఇళ్లు కూల్చేశారు

రాష్ట్ర భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు 2లో..



## సవాళ్లను ఎదుర్కొనేందుకు నిరంతరం అప్రమత్తంగా ఉండాలి

**ప్రజలకు త్వరితగతిన న్యాయం అందించడమే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో పని చేయాలి**

**శాంతి భద్రతల పై ఖమ్మం, వరంగల్ కమిషనరేట్ల పోలీస్ అధికారులతో డీజీపీ శివధర్ రెడ్డి సమీక్ష**


**ముఖ్యమంత్రి నిర్దేశించిన "ప్రజాపాలన -ప్రగతి ప్రణాళిక" కార్యక్రమాలకు సిద్ధం కండి**

**హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి. శివధ్‌ర్ రెడ్డి ఖమ్మం, వరంగల్ పోలీస్ కమిషనరేట్ల పరిధిలో ఆదివారం నాడు విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల పోలీస్ అధికారులతో శాంతిభద్రతల పరిస్థితులపై సమీక్షించి, నేరాల అదుపునకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా మారుతున్న కాలానికి అనుగుణంగా వస్తున్న సవాళ్లను ఎదుర్కొనేందుకు పోలీస్ యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు త్వరితగతిన న్యాయం అందించడమే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో పని చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా ఉద్దేశించిన "అరైవ్ అలైవ్" కార్యక్రమాన్ని ఈనెల 25వ తేదీ నుండి 31వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించాల్సి ఉందన్నారు. అన్ని శాఖల అధికారులను అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగస్వాములను చేసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి తగు ఆదేశాలు ఇచ్చారన్నారు. మిగతా 2లో..

## తెలంగాణలో బుల్డోజర్‌పాలన

**హైదరాబాద్‌లో ఒక్క ఇల్లు కట్టినట్లు నిరూపించినా రాజకీయ సన్యాసం తీసుకుంటా: కేటీఆర్**

**హైదరాబాద్ :** హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ఒక్క ఇల్లు కట్టినట్లు నిరూపించినా.. తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సవాల్ విసిరారు. తెలంగాణలో నడుస్తోంది ప్రజాపాలన కాదని, బుల్డోజర్ పాలన అని ఆరోపించారు. మూసీ బాధితులకు అండగా కేకే నగర్ ఫేజ్ 2 నుంచి మధుపార్క్ రిడ్జ్ వరకు మాజీ మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి తదితర నేతలతో కలిసి కేటీఆర్ 'మూసీ దండియాత్ర' మిగతా 2లో..



## రైతులను నిండా ముంచేందుకే అమెరికాతో ఒప్పందం



**రాహుల్ గాంధీ విమర్శలు**

**బర్నాలా :** భారత్-అమెరికా మధ్య కుదిరిన తాత్కాలిక వాణిజ్య ఒప్పందం దేశీయ రైతాంగాన్ని దెబ్బ తీస్తుందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. శనివారం పంజాబ్‌లోని బర్నాలాలో నిర్వహించిన మజ్దూర్ కిసాన్ మహార్యాలీలో ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ రంగాన్ని విదేశీ మార్కెట్లకు అనుకూలంగా మార్చే అంశంపై ఏకాభిప్రాయం కుదరకపోవడంతో ఈ ఒప్పందం నాలుగు నెలలుగా నిలిచిపోయిందన్నారు. 'ప్రధాని నాలుగు నెలలుగా చేయని పనిని, 15 నిమిషాల్లో ఎలా చేశారు? ఆకస్మికంగా నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఏమొచ్చింది?' అని ఆయన ప్రశ్నించారు. ఏటా అమెరికా నుంచి సుమారు రూ.తొమ్మిది లక్షల కోట్ల విలువైన ఉత్పత్తులను భారత్ కొనుగోలు చేస్తుందని ట్రంప్‌నకు ప్రధాని మోదీ హామీ ఇచ్చారని, ఇది దేశ రైతులను దెబ్బతీస్తుందని పేర్కొన్నారు. లోక్‌సభలో ఆర్మీ మాజీ చీఫ్ మనోజ్ నరవణే పుస్తకం గురించి మాట్లాడాలని అనుకున్నానని, కానీ, అవకాశం ఇవ్వలేదని రాహుల్ తెలిపారు. అలాగే పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో అక్కడి భారతీయుల భద్రతకు సంబంధించి కేంద్రం వెంటనే ముందస్తు చర్యలు తీసుకోవాలని రాహుల్ 'ఎక్స్' వేదికగా కోరారు. మాజీ సైనికుల సహకార ఆరోగ్య పథకం కు నిధులు కేటాయించడంతో పాటు వికలాంగుల పెన్షన్లపై పూర్తి ఆదాయపు పన్ను మినహాయింపును పునరుద్ధరించాలని కోరుతూ నిర్మలా సీతారామన్‌కు లేఖ రాసినట్లు రాహుల్ తెలిపారు.

## నేడు రాష్ట్రానికి రాహుల్

- తెలంగాణ పర్యటనకు రానున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ
- వికారాబాద్‌లో జరుగుతున్న డీసీసీ అధ్యక్షుల శిక్షణ తరగతులకు హాజరు
- తాజా రాజకీయపరిణామాలు, పార్టీబోపేతంపై చర్చించే అవకాశం

2లో..



## నాగ్‌పుర్‌లో భారీ పేలుడు

**17 మంది మృతి.. పలువురికి గాయాలు**

**నాగ్‌పూర్ :** మహారాష్ట్రలోని నాగ్‌పుర్‌లో భారీ పేలుడు సంభవించింది. కటోల్‌లోని పేలుడు పదార్థాల తయారీ పరిశ్రమ ఎస్‌బీఎల్ ఎనర్జీ లిమిటెడ్‌లో తెల్లవారుజామున ఈ ఘటన చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రమాదంలో 17 మంది మృతిచెందగా.. 18 మంది తీవ్రంగా గాయపడినట్లు స్థానిక అధికారులు వెల్లడించారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. శిథిలాల కింద చిక్కుకున్న వారిని బయటకు తీయడానికి సహాయక చర్యలు కొనసాగుతున్నాయన్నారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందన్నారు.ప్రమాదం జరిగిన పరిశ్రమలో డిటోనేటర్లు, కాస్ట్ బూస్టర్లు, భూకంప పేలుడు పదార్థాలు తయారు చేస్తారని స్థానికులు వెల్లడించారు. ఉదయం ఇందులోని ఒక యూనిట్‌లో అకస్మాత్తుగా పేలుడు సంభవించిందని.. ఆ సమయంలో, 30 మందికి మిగతా 9లో..

## నాణ్యమైన తీర్పులతో న్యాయ వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం

**న్యాయ వ్యవస్థలో మధ్యవర్తిత్వానికి కీలక పాత్ర :సీజేఐ జస్టిస్ సూర్యకాంత్**



**అమరావతి :** కోర్టుల్లో వాదనలు సరిగ్గా ఉన్నప్పుడే జడ్జీల నుంచి నాణ్యమైన తీర్పులు వస్తాయని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. అలాంటి తీర్పులతో న్యాయ వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం పెరుగుతుందని చెప్పారు. తిరుపతి పరిధిలోని దామినీడులో 16 కోర్టు భవనాల సముదాయానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జస్టిస్ సూర్యకాంత్ మాట్లాడుతూ న్యాయం అందించేందుకు నిర్దేశిత గడువు ఉండాలని అభిప్రాయపడ్డారు. కోర్టు నూతన భవనంలో న్యాయవాదులకు మంచి సౌకర్యాలు కల్పించాలని, మెడికల్ సెంటర్ ఉండాలని సూచించారు. ఏపీ హైకోర్టు సీజే జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ మాట్లాడుతూ గతంలో చాలా కోర్టుల్లో జడ్జీల ఛాంబర్లు సరిగా ఉండేవి కాదన్నారు. గతంలో కశ్మీర్ వరదలు వచ్చినప్పుడు హైకోర్టు భవనం పూర్తిగా మునిగిపోయిందని, టెంట్‌ల కింద కోర్టు కార్యకలాపాలు నిర్వహించామని తెలిపారు. న్యాయ వ్యవస్థపై నమ్మకం కలిగేలా సిబ్బంది వ్యవహరించాలని హైకోర్టు సీజే పేర్కొన్నారు.


**న్యాయ వ్యవస్థలో మధ్యవర్తిత్వానికి కీలక పాత్ర**

న్యాయ వ్యవస్థలో మధ్యవర్తిత్వానిది కీలక పాత్ర అని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. మధ్యవర్తిత్వం వల్ల అనేక కేసులు సులువుగా పరిష్కారం అవుతాయన్నారు. ప్రతి సమస్యకు కోర్టుకు రావడమే పరిష్కారం కాదని, కుటుంబ తగాదాల వల్ల కోర్టుల్లో కేసులు బాగా పెరుగుతున్నాయని చెప్పారు. అమరావతిలో నిర్వహించిన 'మధ్యవర్తిత్వంపై రాష్ట్రస్థాయి సదస్సు'కు ఆయన హాజరయ్యారు. " మధ్యవర్తిత్వం వల్ల మిగతా 2లో..

## తెలంగాణ ఆత్మ కళలు

**కళలు, సంస్కృతికి ప్రభుత్వం పెద్దపీట • దేవాలయాలు, టూరిజం, కల్చర్‌తో కూడిన యాక్షన్ ప్లాన్ రూపొందించండి: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

**హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రం ఆత్మ కళలు, ఆ కళలు, సంస్కృతికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. హైదరాబాద్ లోని ఎల్బీ ఇండోర్ స్టేడియంలో రామదాసు జయంతి ఉత్సవాలలో ఉప ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ నేల గర్వించదగ్గ గొప్ప వాగ్గేయకారుడు, భద్రాచల రామదాసు అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కొనియాడారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలోని కళాకారులకు, సాంస్కృతిక వైభవానికి పూర్వ వైభవం తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.గత రెండు సంవత్సరాలుగా రాష్ట్ర ప్రభుత్వం సాధించిన అనేక విజయాలను రాష్ట్ర అభివృద్ధి గురించి సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలతో ప్రజలకు వివరించారు, ఆ కళారూపాల్లో ప్రజలు పాల్గొనడమే కాదు ప్రజలు స్పందించిన తీరు తనకు వ్యక్తిగతంగా తెలిసిన వ్యక్తిగా భవిష్యత్తులో సంగీత నాటక అకాడమీ విరివిగా కార్యక్రమాలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తూ ముందుంటుందని, అవసరమైన ఆర్థిక అవసరాలను తీరుస్తామని డిప్యూటీ సీఎం భరోసా ఇచ్చారు. నేలకొండపల్లిలో జన్మించిన గోపన్న తన భక్తితో, కీర్తనలతో భక్త రామదాసుగా చిరస్థాయిగా నిలిచిపోయారని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కొనియాడారు. ఆయన కట్టిన భద్రాచలం ఆలయం, రాసిన కీర్తనలు ప్రతి తెలుగువారి గుండెల్లో నిలిచిపోయాయని పేర్కొన్నారు. రాష్ట్ర విభజన తర్వాత మన ప్రాంత వాగ్గేయకారుల గొప్పతనాన్ని మిగతా 2లో..



# ఖమేనీ పగ్గాలు ముగ్గురు సభ్యుల కౌన్సిల్ చేతికి

టెహ్రాన్ :ఇరాన్‌లో పాలన చాలా ఏళ్ల తర్వాత సుప్రీం లీడర్ చేతి నుంచి ఓ కౌన్సిల్‌కు మారింది. అమెరికా–ఇజ్రాయెల్ నిర్వహించిన సంయుక్త దాడిలో ఆ దేశ సుప్రీం అయతుల్లా అలీ ఖమేనీ ప్రాణాలు కోల్పోవడంతో ఇప్పుడు ముగ్గురు సభ్యుల కౌన్సిల్ చేతికి దేశ పాలనా పగ్గాలు చేరినట్లు ఆ దేశ అధికారిక మీడియా ఐఆర్ఎన్ఏ ప్రకటించింది. ఈ కౌన్సిల్‌లో అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్, న్యాయ వ్యవస్థ అధిపతి, గార్డియన్ కౌన్సిల్‌లోని ఒక జ్యూరీ సభ్యుడితో దీనిని ఏర్పాటు చేసినట్లు వెల్లడించింది. ఈ కౌన్సిల్ తాత్కాలికంగా మాత్రమే ఇరాన్ పాలనా బాధ్యతలను చూడనుంది. ఇరాన్‌లో సుప్రీం లీడర్ తర్వాత శక్తిమంతమైన విభాగాల్లో ఇది కూడా ఒకటి. దీనిలో 88 మంది సభ్యులు ఉంటారు. వీరిని అసెంబ్లీ ఆఫ్ ఎక్స్‌పర్ట్స్ అని కూడా వ్యవహరిస్తారు. ఆ దేశ చట్టం ప్రకారం ఇరాన్ సుప్రీం లీడర్‌ను ఎన్నుకునే అధికారం ఈ గ్రూపునకు ఉంది. ఈ ప్యానల్‌లో ఎనిమిదేళ్ల పదవీకాలం కోసం ఎంపికై వచ్చిన షియా మతగురువులు ఉంటారు. ఈ విభాగమే రాజ్యాంగ పరిరక్షణ బాధ్యత కూడా చూస్తుంది.మరోవైపు ఇరాన్ అత్యున్నత దళమైన ఐఆర్‌జీసీ కమాండర్ మహమూద్ పాక్‌పౌర్, ఖమేనీ కీలక సలహాదారుడు అలీ షామ్‌ఖానీ కూడా అమెరికా దాడుల్లో మృతి చెందినట్లు ఆ దేశ అధికారిక మీడియా ధ్రువీకరించింది.

**తొలి టార్గెట్ ఖమేనే**

ఇరాన్ అగ్రనేత ఖమేనీ కదలికలు.. షెడ్యూల్ పక్కాగా అమెరికా వద్ద ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో ఆయనే లక్ష్యంగా చేసుకొని అమెరికా ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీని మొదలుపెట్టింది. శనివారం ఖమేనీ తన కీలక సలహాదారులైన షాంఖానీ, సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ కార్యదర్శి అలీ లరిజానీతో భేటీ అయ్యారు. ఈ సమావేశ సమాచారమే దాడులు చేసేలా అమెరికాను పురిగొల్పింది. నిఘా సంస్థ సీఐఏ కొన్ని నెలలుగా ఇజ్రాయెల్ ఇంటెలిజెన్స్ సమన్వయంతో ఖమేనీ కదలికలపై నిఘా ఉంచింది. ఖమేనీ పాలన భవనాల్లో ఒక చోట ఈ భేటీ జరగనున్నట్లు గుర్తించారు. దీంతో అక్కడే దాడిచేయాలని అమెరికా, ఇజ్రాయెల్ భావించాయి. కాకపోతే ఆ భవన ప్రాంగణాల్లో ఎక్కడ ఖమేనీ ఉన్నారో ఆ దేశాల వద్ద కచ్చితమైన సమాచారం లేదు. ఖమేనీ భేటీ కూడా శనివారం సాయంత్రం జరగాల్సి ఉన్నట్లు సమాచారం ఉన్నా.. ఆ తర్వాత దాని షెడ్యూల్ ఉదయానికి మారినట్లు నిఘా వర్గాలు గుర్తించాయి. దీంతో దాడి సన్నాహాలను వేగవంతం చేశాయి.

ఖమేనీ నివాసంపై 30 బాంబులు..

ఇరాన్ సుప్రీం నేత ఖమేనీ నివాస కాంప్లెక్స్(లీడర్‌షిప్ హౌస్), సమీపంలో ఇజ్రాయెల్ ఫైటర్ జెట్లు 30 బాంబులతో దాడి చేసినట్లు వాల్‌స్ట్రీట్ జర్నల్ కథనంలో పేర్కొంది. ఇరాన్ సైనిక, పౌర నాయకత్వాలు సంయుక్త సమావేశం నిర్వహిస్తే దాడి చేసేందుకు అమెరికా నిఘా సంస్థ కాచుకొని కూర్చొంది. ఇలాంటివి మూడు భేటీలు శనివారం జరగనున్నట్లు వాటికి ఉప్పందింది. వీటిల్లో ఖమేనీ లొకేషన్ కూడా కచ్చితంగా తెలిసింది. దీంతో తొలివిడతలోనే అమెరికా–ఇజ్రాయెల్ దళాలు ఆ ప్రాంతంపై విరుచుకుపడ్డాయి. అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్‌ను కూడా లక్ష్యంగా చేసుకొన్నా.. ఆయన ప్రాణాలతో బయటపడ్డారు.

ఈ దాడులకు ఆంత్రోపిక్ ఏఐ..

ఇరాన్‌పై దాడుల కోసం అమెరికా ఆంత్రోపిక్ క్లాడ్ ఏఐని వాడినట్లు వాల్‌స్ట్రీట్ కథనంలో పేర్కొంది. అనంతరం ఈ కంపెనీ టూల్స్‌ను ఫెడరల్ ఏజెన్సీల వినియోగంపై దశల వారీగా నిషేధం విధిస్తూ ట్రంప్ నిర్ణయం తీసుకొన్నట్లు తెలుస్తోంది. అయినా ఇంటెలిజెన్స్ అసిస్టెన్స్, లక్ష్యాలను గుర్తించడం, యుద్ధక్షేత్ర పరిస్థితులను అంచనావేయడం వంటి సేవలకు పెంటగాన్ వినియోగించింది. ఇప్పటికే పాలంటైర్, అమెజాన్ వెబ్ సర్వీసెస్‌తో కలిపి ఆంత్రోపిక్ అమెరికా సైన్యానికి సేవలు అందిస్తోంది. అయితే.. అమెరికా రక్షణశాఖతో విభేదాల కారణంగా ఇటీవల ఆంత్రోపిక్‌ను ఫెడరల్ ఏజెన్సీల్లో వాడకంపై నిషేధం విధించారు. వెనెజువెలా అధినేత మదురోను అదుపులోకి తీసుకొనే వేళ కూడా ఆంత్రోపిక్‌ను వాడినట్లు తెలుస్తోంది. ఓపెన్ ఏఐ, గూగుల్, ఎక్స్‌ఏఐ కృత్రిమ మేధ సేవలను కూడా అమెరికా వాడుతోంది.

తోమహాక్ క్షిపణలు.. ఆత్మాహుతి డ్రోన్లు..

అమెరికా తన అత్యాధునిక ఆయుధాలను ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీలో వాడినట్లు ఆ దేశ వార్ సెక్రటరీ పీట్ హెగ్సెత్ వెల్లడించారు. అమెరికా వాడిన వాటిల్లో స్టెల్త్‌జెట్‌లు కూడా ఉన్నాయి. ఈ దాడిలో తొలిసారి చౌకబారు వన్‌వే డ్రోన్లను అమెరికా రంగంలోకి దించడం గమనార్హం. ఇప్పటి వరకు ఇరాన్ ఈ తరహా డ్రోన్లను వాడుతూ వస్తోంది. ఇరాన్ చుట్టుపక్కల స్థావరాల నుంచి అమెరికా హిమార్స్ రాకెట్‌లను కూడా ప్రయోగించింది. సుదూరాల నుంచే లక్ష్యాలను ఛేదించే ఆయుధాలను కూడా రంగంలోకి దించినట్లు కథనాలు వెలువడుతున్నాయి. అమెరికాలోని అరిజోనా ఫినిక్స్ కేంద్రంగా పనిచేసే స్పెక్ట్రెవర్క్స్ తయారు చేసిన ఒజఅయా (లోకాస్ట్ అన్ మ్యాన్డ్ అటాక్ సిస్టమ్)ను ఈ దాడి కోసం రంగంలోకి దించారు. వీటి ఒక్కోదాని విలువ 35,000 డాలర్లు మాత్రమే. సెంట్‌కామ్ వీటి ఫొటోలను షేర్ చేసింది. సదరు కంపెనీ మాత్రం వీటి వినియోగంపై స్పందించలేదు. ఇక అమెరికా నమ్మకమైన ఆయుధం తోమహాక్ క్షిపణులను కూడా ఈ దాడుల్లో వాడారు. ఒక్కో క్షిపణి ఖరీదు 1.3 మిలియన్ డాలర్లు.

టెహ్రాన్‌లో భారీ పేలుళ్లు!

ఇరాన్ రాజధాని టెహ్రాన్‌పై ఇజ్రాయెల్ మరోసారి విరుచుకుపడింది. భీకర దాడుల కారణంగా నగరంలో భారీ పేలుళ్లు సంభవించాయి. పేలుళ్ల ధాటికి భూమి కంపించడంతోపాటు పెద్దఎత్తున పొగలు అలుముకున్నాయి. పేలుళు సంభవించిన ప్రాంతానికి సమీపంలోనే ఇరాన్ పోలీసు హెడ్‌క్వార్టర్స్, అధికారిక టెలివిజన్ కార్యాలయం ఉన్నాయి. సెంట్రల్ టెహ్రాన్‌ను లక్ష్యంగా చేసుకున్నట్లు ఇజ్రాయెల్ సైన్యం వెల్లడించింది. యుద్ధం మొదటి రోజు.. టెహ్రాన్‌ను చేరుకునే మార్గంలోని అడ్డంకులను తొలగించామని, రెండో రోజు కీలక ప్రాంతాల్లో దాడులు చేస్తున్నామని తెలిపింది.హార్ముజ్ జలసంధిలో ఓ చమురు ట్యాంకర్‌పై దాడి జరిగిందని ఒమన్ వెల్లడించింది. నలుగురు సిబ్బంది గాయపడ్డారని తెలిపింది. పలావు జెండాతో ప్రయాణిస్తున్న స్కైలైట్ అనే చమురు ట్యాంకర్ లక్ష్యంగా ఈ దాడి జరిగినట్లు చెప్పింది. అందులో భారత్, ఇరాన్‌కు చెందిన సిబ్బంది ఉన్నారని పేర్కొంది. అయితే, దీనిపై ఎవరు దాడికి పాల్పడ్డారో తెలియరాలేదు. మరోవైపు ఇరాక్‌లోని ఓ మిలిటెంట్ గ్రూప్.. ఇర్బిల్‌లోని అమెరికా వైమానిక స్థావరాన్ని లక్ష్యంగా చేసుకుని డ్రోన్ దాడి చేసింది.

# డీఎంకే అధికార స్వప్నాలు పీడకలలుగా మారడం ఖాయం

**వచ్చే ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుంది • ప్రధాని మోదీ ధీమా**

చెన్నై : తమిళనాడులో ఎన్నికలు సమీపిస్తున్న వేళ అధికార డీఎంకేపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ. తిరిగి అధికారంలోకి వస్తామని చెబుతున్న డీఎంకేకు అది పీడకలగానే మిగిలిపోతుందని ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికలు రాష్ట్రానికి కీలక టర్నింగ్ పాయింట్‌గా మారుతుందని అభిప్రాయపడ్డారు. మదురైలో నిర్వహించిన ఎన్‌డీఏ ర్యాలీలో ఆయన ప్రసంగించారు."తమిళనాడులోని మహిళలు కష్టాల్లో చిక్కుకుపోయారు. రాష్ట్రంలో రోజురోజుకూ క్రైమ్ పెరిగిపోతుంది. ఆల్కహాల్, డ్రగ్ మాఫియాతో తమ కుటుంబాలు నాశనం అవ్వడాన్ని వారుక ల్లారా చూస్తున్నారు. అమ్మ జయలలిత పాలనలో ఎంత మెరుగ్గా జీవించామో అని వారు ఇప్పుడు గుర్తు చేసుకుంటున్నారు. అయితే, ప్రతీ ఒక్క తమిళ తల్లి, సోదరి, కూతురుకి ఒక మాట ఇస్తున్నాను. ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మొదటగా రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్‌పై దృష్టి పెడతాం. డ్రగ్ మాఫియా, క్రిమినల్స్‌ను జైలులో వేస్తామని అన్నారు.

# ఖమేనీ మృతితో ఇరాన్ బాంబుల వర్షం

డ్రోన్లతో ప్రతిదాడులకు దిగింది. దీంతో పలు దేశాల్లో భారీగా పేలుళ్లు జరిగాయి. ఇరాన్‌కు చెందిన ఐఆర్‌జీసీ దళాలు నిన్నటి నుంచి ఆరోసారి పశ్చిమాసియాలోని అమెరికా స్థావరాలపై దాడులు నిర్వహించాయి.మొత్తం 27 బేస్‌లను లక్ష్యంగా చేసుకున్నట్లు ఐఆర్‌జీసీ వెల్లడించింది. వీటిలో ఇజ్రాయెల్‌లోని టెల్ నోఫ్ ఎయిర్ బేస్, ఇజ్రాయెల్ ఆర్మీ ప్రధాన కార్యాలయం హాకిర్యా కూడా ఉన్నాయి. దీంతోపాటు ఇజ్రాయెల్‌లోని రక్షణరంగ ఫ్యాక్టరీలను కూడా ఇరాన్ టార్గెట్ చేసుకుంది. ఖతార్ గగనతలం ఆదివారం ఉదయం 7.30 సమయంలో పేలుళ్లతో దద్దరిల్లింది. దాని రాజధాని దోహాలో మొత్తం 11 పేలుళ్లు జరిగాయి. మరోవైపు ఇజ్రాయెల్ వ్యాప్తంగా సైరన్లు మోగుతూనే ఉన్నాయి. దుబాయ్‌లో మూడు భారీ పేలుళ్లు సంభవించాయి. ఉదయం 8.15 సమయంలో ఇవి చోటు చేసుకున్నాయి. ఇరాన్ ప్రయోగించిన ఆయుధాలను ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు గగనతలంలోనే పేల్చిసినట్లు తెలుస్తోంది. శకలాలు కూలడంతో దుబాయ్‌లో అత్యంత రద్దీగా ఉండే జబిల్ అలీ పోర్టులో భారీగా మంటలు చెలరేగాయి. మరోవైపు అమెరికా నౌకలకు మందుగుండు సరఫరా చేసే ఎంఎస్‌పీ షిప్‌పై నాలుగు డ్రోన్లతో దాడి చేసినట్లు ఇరాన్ ప్రకటించింది. దీనిని ఆపరేషన్ ట్రూ ప్రామిస్‌లో భాగంగా చేపట్టినట్లు వెల్లడించింది. ఇరాన్ దాడుల నేపథ్యంలో బహ్రెయిన్ కూడా ప్రజలను అప్రమత్తం చేసింది. సైరన్లు మోగిన వెంటనే సమీపంలోని సురక్షిత ప్రదేశాలకు వెళ్లాలని సూచించింది. ఇరాక్‌లోని ఇర్బిల్ ఎయిర్ పోర్టుపై దాడి జరిగింది. దీంతో భారీగా పొగ, మంటలు వ్యాపించాయి. బాగ్దాద్‌లోని గ్రీన్ జోన్ సమీపంలో తీవ్ర ఆందోళనలు చెలరేగాయి. ఇరాన్ అధినేత ఖమేనీ మృతి నేపథ్యంలో ఇవి తలెత్తాయి.

**భారతీయులున్న ట్యాంకర్‌పై ఇరాన్ దాడి..!**

అంతర్జాతీయ చమురు రవాణాకు జీవనాడి వంటి హర్మూజ్ జలసంధి ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ మృతితో భగ్గుమంది. ఈ కీలక చమురు మార్గాన్ని మూసివేస్తున్నట్లు టెహ్రాన్ ప్రకటించిన కొన్ని గంటల్లోనే ఓ ట్యాంకర్‌ను లక్ష్యంగా చేసుకొని దాడి చేసింది. పలావు దేశ పతాకంతో వస్తున్న స్కైలైట్ చమురు ట్యాంకర్‌పై ఆదివారం ఒమన్‌లోని ముసాండమ్ ద్వీపకల్పం వద్ద ఖసాబ్ పోర్టు వద్ద ఇరాన్ దాడి చేసింది. ఆ సమయంలో నౌకలో మొత్తం 20 మంది సిబ్బంది ఉన్నారు. వీరిలో 15 మంది భారతీయులు.. మిగిలిన వారు ఇరాన్ జాతీయులు. ఈ దాడిలో నలుగురు గాయపడ్డారని ఒమన్ వెల్లడించింది. అరేబియా సముద్రంలో ఒమన్‌కు చెందిన ముసాండం ద్వీపకల్పం–ఇరాన్ మధ్య ఉన్న అత్యంత ఇరుకైన జలసంధి ఇది. దీనిలో ఓ చోట అత్యంత ఇరుకుగా కేవలం 33 కిలోమీటర్లు మాత్రమే ఉంటుంది. ఇరు దేశాలు ఇందులో అత్యధిక భాగం తమదే అని చెబుతున్నాయి. రెండు షిప్పింగ్ లేన్లు ఉన్నాయి.ఇందులో క్రూడ్ క్యారియర్లు సులువుగా ప్రయాణించగలుగుతాయి. ఈ మార్గం నుంచి నిత్యం 2 కోట్ల పీపాల చమురు వివిధ దేశాలకు వెళుతుంది. ఇది మొత్తం ప్రపంచం వినియోగించే దానిలో ఐదో వంతుకు సమానం. సౌదీ, ఇరాన్, యూఏఈ, కువైట్, ఇరాక్‌ల నుంచి ఎగుమతి అవుతోంది. ఇక లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్ రవాణాకు కూడా అత్యంత కీలకం. మూడింట ఒక వంతు ఎల్ఎన్‌జీ కూడా ఇక్కడి నుంచే వివిధ దేశాలకు చేరుతుంది.

**భారత్‌పై తీవ్ర ప్రభావం**

మన దేశం దిగుమతి చేసుకొనే ఎల్ఎన్‌జీలో సగానికిపైగా ఈ మార్గం నుంచే రావాల్సి ఉంటుంది. హర్మూజ్ మీదుగానే రావాల్సి ఉంది. ఇక రోజువారీ 55లక్షల పీపాల చమురును భారత్ ఈ మార్గం నుంచి దిగుమతి చేసుకొంటోంది. ఇది భారత చమురు అవసరాల్లో 40%శాతానికి సమానం. గత రెండు నెలల్లో ఇది 50% శాతానికి చేరింది. హర్మూజ్‌లో ఇబ్బందులు ప్రపంచ చమురు మార్కెట్లను తీవ్రంగా ప్రభావితం చేయనున్నాయి.

# దాడులు ఆపకపోతే తీవ్రపరిణామాలు

వాషింగ్టన్ :పశ్చిమాసియాలోని తమ స్థావరాలపై ఇరాన్ క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడుతున్న నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీవ్రంగా స్పందించారు. "అమెరికాపై అత్యంత తీవ్ర స్థాయిలో దాడులు చేస్తామని ఇరాన్ నేడు ప్రకటించింది.. మేము ఆ దేశంపై ఎన్నడూ చూడనంత శక్తితో విరుచుపడతాము. ఏమీ చేయకుండా మౌనంగా ఉండటం ఇరాన్‌కు ఉత్తమం. ఒకవేళ వారు ఏమైనా చేస్తే.. వారు గతంలో కనీవినీ ఎరుగని శక్తితో దాడి చేస్తాం. ఈ విషయంపై దృష్టి సారించినందుకు ధన్యవాదాలు" అని పేర్కొన్నారు. తమ అగ్రనేత ఖమేనీపై దాడికి తీవ్ర స్థాయిలో ప్రతీకారం తీర్చుకొంటామని నేడు ఇరాన్ ప్రకటించింది. అమెరికా స్థావరాలపై ఏ క్షణామైనా భయానక దాడులు జరగొచ్చని పేర్కొంది. మరోవైపు ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ స్పందిస్తూ.. అమెరికా అత్యంత తీవ్రమైన నేరం చేసిందని, దీనికి ప్రతీకారం తప్పదని హెచ్చరించారు. "జవాబుదారీతనం లేకుండా అతిపెద్ద నేరం మిగలదు. షియా, ఇస్లామిక్ చరిత్రలో ఇది మరో అత్యంత కీలక మలుపుగా ఉంటుంది" అని వెల్లడించారు. ఇరాన్‌లో సుప్రీం లీడర్ తర్వాత శక్తిమంతమైన నాయకుల్లో ఒకరైన అలీ లరిజానీ తాజాగా ఖమేనీ మృతిపై స్పందించారు. ఇరాన్ ప్రజల హృదయాలపై అమెరికా పొడిచిందని.. తాము కూడా కచ్చితంగా అమెరికన్ల హృదయాలపై దాడి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. తమ సైనిక దళాల ప్రతిదాడి చాలా తీవ్రంగా ఉంటుందని చెప్పారు. తాము తన్ని పారిపోబోమని అమెరికన్లకు తెలుసన్నారు. ఖమేనీ సలహాబృందంలో అలీ లరిజానీ నిర్ణయాత్మక వ్యక్తి. ఆయన ది సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. అమెరికా దాడుల నుంచి బయటపడిన ఇరాన్ అత్యున్నత నేతల్లో ఆయన కూడా ఒకరు.

'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ'ని స్వయంగా పర్యవేక్షించిన ట్రంప్..!

ఇరాన్‌పై అమెరికా చేపట్టిన 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ'ని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్వయంగా పర్యవేక్షించారు. సాధారణంగా హైవేల్యూ టార్గెట్లపై జరిగే దాడులే అమెరికా అధ్యక్షుడి కనుసన్నల్లో జరుగుతాయి. తాజాగా ట్రంప్ పర్యవేక్షణకు సంబంధించిన చిత్రాలను శ్వేతసౌధంవిడుదల చేసింది. ఫ్లోరిడాలోని పామ్‌బీచ్‌లోని ట్రంప్ స్వగృహం మార్ ఎ లాగో రిసార్ట్‌లోని ఆయన రివ్యూ చేస్తుండగా తీసిన ఫొటో ఇది. ట్రంప్‌తో పాటు విదేశాంగ మంత్రి మార్కో రూబియో, ఆర్మీ కీలక జనరల్స్ సుసీ విల్లీస్, డాన్ కెయిన్ తదితరులు కూడా అక్కడే ఉన్నారు. మరోవైపు ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కూడా వార్ రూమ్‌లో పరిస్థితిని పర్యవేక్షిస్తున్న చిత్రాన్ని శ్వేతసౌధం పోస్టు చేసింది. ఇప్పటికే అమెరికా అధ్యక్షుడు సౌదీ, ఇజ్రాయెల్ సహా ఇతర గల్ఫ్ నేతలతో కూడా టచ్‌లో ఉన్నట్లు వెల్లడించింది. అమెరికా చేపట్టిన 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ'తోపాటే.. ఇజ్రాయెల్ కూడా 'ఆపరేషన్ రోర్ ఆఫ్ ది లయన్' చేపట్టిన విషయం తెలిసిందే. ఈ దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ కన్ను మూసిన విషయాన్ని టెహ్రాన్ ఇప్పటికే ధ్రువీకరించింది.

**అధ్యక్షుడు చెప్పారు.. మేం చేశాం..!**

అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సాహసోపేతమైన చర్యలు తీసుకోవాలని తమను ఆదేశించినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. ఆయన కోరినట్లుగానే తాము వ్యవహరించినట్లు ఎక్స్‌లో పోస్టు చేసింది. 'ఇరాన్ నుంచి తలెత్తే ముప్పు నుంచి అమెరికా ప్రజలను కాపాడటమే మా లక్ష్యమని అధ్యక్షుడు చెప్పారు. ఈ క్రమంలో సాహసోపేతమైన ఆపరేషన్లు చేపట్టామని ఆదేశించారు. ఆ మేరకు సెంట్‌కామ్ దళాలు ఇరాన్‌ను కోలుకోలేని విధంగా దెబ్బతీశాయి" అని పేర్కొంది.

# అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘన

**ఖమేనీ మృతిపై రష్యా అధ్యక్షుడు పుతిన్ సంతాపం**

మాస్కో :ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ మృతిపై రష్యా అధ్యక్షుడు పుతిన్ సంతాపం ప్రకటించారు. అంతర్జాతీయ చట్టాలు, నైతిక విలువలను.. అమెరికా, ఇజ్రాయెల్‌లు ఉల్లంఘించాయని ఆక్షేపించారు. ఇరాన్‌పై దాడులను తక్షణమే ఆపాలని డిమాండ్ చేశారు. ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్‌కు రాసిన లేఖలో పుతిన్ ఈమేరకు పేర్కొన్నట్లు రష్యన్ మీడియా తెలిపింది. మరోవైపు.. ఇరాన్ అణ్వాయుధాల తయారీని నిలిపివేయాలని జపాన్ సూచించింది. అమెరికా, ఇరాన్‌లు చర్చలు కొనసాగించాలని తెలిపింది.ప్రస్తుత పరిణామాలతో పశ్చిమాసియా గందరగోళంలోకి జారిపోయే ప్రమాదం ఉందని ఈజిప్ట అధ్యక్షుడు అబ్దెల్ ఫతా ఎల్‌సిసి ఆందోళన వ్యక్తం చేశారు. తమ దేశంపైకి దూసుకొస్తున్న క్షిపణులు, డ్రోన్లు అడ్డుకుంటున్నట్లు కువైట్, ఖతర్, బహ్రెయిన్‌లు వెల్లడించాయి. యూఏఈలోని అబుధాబీలో డ్రోన్ శకలాలు పడి ఓ మహిళ, ఆమె బిడ్డకు స్వల్ప గాయాలయ్యాయి. గల్ఫ్ దేశాలపై దాడులతో ఇరాన్ తప్పుడు లక్ష్యాలను ఎంచుకుందని యూఏఈ అధ్యక్షుడి సలహాదారుడు అన్వర్ వ్యాఖ్యానించారు. పొరుగు దేశాలతో యుద్ధం తగదన్నారు.

# తెలంగాణ బిడ్డలు అప్రమత్తంగా ఉండండి

హైదరాబాద్ ఇరాన్, గల్ఫ్ ప్రాంతాల్లో ఉన్న తెలుగు ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. దాడుల దృష్ట్యా వార్తల నేపథ్యంలో భద్రతా మార్గదర్శకాలు పాటించాలన్నారు. ఆయా దేశాల్లోని భారత రాయబార కార్యాలయాలు జారీ చేసే సూచనలు పాటించాలన్నారు. అత్యవసర పరిస్థితి ఎదురైతే తప్ప తెలుగు ప్రజలు బయటకు రాకూడదన్నారు. తెలుగువారిని రప్పించేందుకు కేంద్రంతో రాష్ట్రం సమన్వయం చేసుకుంటుందని వివరించారు. ఇరాన్, గల్ఫ్ దేశాల్లోని.. రాష్ట్ర ప్రజల పరిస్థితిని ప్రభుత్వం నిరంతరం పరిశీలిస్తోందని తెలిపారు.

# ఖమ్మంలో దౌర్జన్యంగా పేదల ఇళ్లు కూల్చేశారు

**తెలంగాణ భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు**

ఖమ్మం : నోటీసులు ఇవ్వకుండా దౌర్జన్యంగా పేదల ఇళ్లను కూల్చివేశారని తెలంగాణ భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. ఖమ్మం శివారు వెలుగుమట్లలోని భూదాన్ భూములను ఆయన పరిశీలించారు. భూ నిర్వాసితులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో రామచందర్‌రావు మాట్లాడారు. "భూదాన్ బోర్డు పట్టాలున్న పేదల ఇళ్లను కూల్చివేశారు. ఇది ప్రజా ప్రభుత్వం కాదు.. పేదల వ్యతిరేక ప్రభుత్వం. పేదల ఇళ్లు కూలగొట్టి ఏం సాధించారు?బాధితుల పక్షాన భాజపా పోరాడుతుంది. కూల్చిన చోట పేదలకు 100 గజాల్లో ఇల్లు నిర్మించి ఇవ్వాలి. రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసమే పేదలను పంపించేస్తున్నారు" అని ఆయన ఆరోపించారు.

## ప్రతిపక్షాలు చిల్లర రాజకీయాలు చేయకుండా సంయమనం పాటించాలి

వెలుగుచూడటంతో పలువురిపై క్రిమినల్ కేసులు కూడా నమోదు చేశారు. అక్రమ గృహాల తొలగింపుతో రూ.250 కోట్ల విలువైన భూమిని స్వాధీనపరచుకున్నట్లు కలెక్టర్ ప్రకటించారు.

## తెలంగాణలో బుల్డోజర్‌పాలన

నిర్వహించారు. కాంగ్రెస్ అంటే.. మోసం అని తెలిసే నగర ప్రజలు అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. తమ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు రూ.3,866 కోట్లతో ఎస్టీపీలు నిర్మించడమే కాకుండా, ఒక్క ఇల్లు పడగొట్టకుండా ఉప్పల్ ప్రాంతంలో 5 కి.మీ మేర మూసీ సుందరీకరణ చేసినట్లు గుర్తు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మాత్రం రెండు, మూడు ఇళ్లు ఉండొచ్చుగానీ, పేదవాడికి ఒక ఇల్లు ఉంటే కంటగింపు ఎందుకని మండిపడ్డారు. రూ.16వేల కోట్లతో డీపీఆర్ పూర్తయ్యే పనికి.. రూ.లక్షన్నర కోట్లు ఎందుకని ప్రశ్నించారు. కమిషన్లకు ఎగబడి ప్రభుత్వానికి విలువ లేకుండా చేశారని దుయ్యబట్టారు. మధుపార్క్ రిట్జ్ మాత్రమే కాకుండా మూసీ పొడవునా 55 కిలోమీటర్ల మేర లక్షాయాభై వేల కుటుంబాలకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుల కోసం ఎంతవరకైనా కొట్లాడతామని అన్నారు.

## తెలంగాణ ఆత్మ కళలు

చాటిచెప్పేలా ఇటువంటి ఉత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోందని ఆయన తెలిపారు.చైతన్యానికి కళలే ఆయువుపట్టని అన్నారు. తెలంగాణ గ్రామాల్లోని ప్రతి సమస్యకు కళారూపాల ద్వారానే పరిష్కారాన్ని, చైతన్యాన్ని తీసుకువచ్చిన చరిత్ర మనదని డిప్యూటీ సీఎం గుర్తుచేశారు. కేవలం వినోదం కోసమే కాకుండా, ప్రజలను జాగృతం చేసేందుకు కళలు దోహదపడతాయని ఆయన అభిప్రాయపడ్డారు. యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప వంటి ప్రపంచ వారసత్వ కట్టడాలు, రాష్ట్రంలోని పురాతన ఆలయాలను కలుపుతూ.. పర్యాటకం, సంస్కృతి మేళవించిన ఒక ప్రత్యేక 'యాక్షన్ ప్లాన్' సిద్ధం చేయాలని సంగీత నాటక అకాడమీని ఆయన ఆదేశించారు.కళల పట్ల ప్రజలకు ఉన్న మక్కువ చూస్తుంటే సంతోషంగా ఉందని, భవిష్యత్తులో ఇటువంటి కార్యక్రమాలకు ప్రభుత్వం తరఫున అన్ని విధాలా ఆర్థిక సహాయ సహకారాలు అందిస్తామని భట్టి విక్రమార్క భరోసా ఇచ్చారు.





అదేవిధంగా, రాష్ట్ర ముఖ్యమంత్రి ఆలోచనలకు అనుగుణంగా "ప్రజా పాలన– ప్రగతి ప్రణాళిక "కార్యక్రమం మార్చి ఆరో తేదీ నుండి జూన్ 12వ తేదీ వరకు జరగనున్నందున రాష్ట్ర పోలీస్ శాఖ తరఫున పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపట్టాలన్నారు. 99 రోజుల పాటు కార్యక్రమాలు కొనసాగుతాయని తధానుగుణంగా పోలీస్ అధికారులు పనిచేయాల్సి ఉందన్నారు.డిజిపి ముందుగా ఖమ్మం జిల్లాకు చేరుకుని అక్కడ సాయుధ పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించిన అనంతరం, పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో నూతనంగా నిర్మించిన స్టాఫ్ క్వార్టర్లను, అత్యాధునిక క్రీడా సదుపాయాలతో కూడిన పోలీస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా నేర సమీక్షా సమావేశంలో మాట్లాడుతూ.. సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మాదకద్రవ్యాల రవాణాకు అడ్డుకట్ట వేయడంతో పాటు, సరిహద్దు రాష్ట్రాల నుంచి జరుగుతున్న ఇసుక అక్రమ రవాణాను పూర్తిస్థాయిలో కట్టడి చేయాలని ఆదేశించారు. తెలంగాణ పోలీసులు దేశంలోనే సాంకేతిక వినియోగంలో ముందున్నారని, అదే స్ఫూర్తితో 'సైబర్ సింబా', 'అరైవ్ అలైవ్' వంటి కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని స్పష్టం చేశారు.మధ్యాహ్నం వరంగల్ చేరుకున్న డిజిపి మడికొండలోని పోలీస్ శిక్షణ కేంద్రం ఆవరణలో ఇండియన్ ఆయిల్ సహకారంతో ఏర్పాటు చేసిన నూతన పోలీస్ పెట్రోల్ ఫిల్లింగ్ స్టేషన్‌ను ప్రారంభించారు. అనంతరం హన్మకొండలో ఆధునీకరించిన పోలీస్ అతిథి గృహాన్ని ప్రారంభించి సౌకర్యాలను పరిశీలించారు. సాయంత్రం జనగామ జిల్లాకు చేరుకున్న ఆయన, అక్కడ నూతనంగా ఏర్పాటు

## సవాళ్లను ఎదుర్కొనేందుకు నిరంతరం అప్రమత్తంగా ఉండాలి

చేసిన 'భరోసా' కేంద్రాన్ని ప్రారంభించి బాధితులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. మహిళలు, శిశువుల భద్రతకు పెద్దపీట వేయాలని, ఫోరెన్సిక్ మరియు సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు నాణ్యతను పెంచాలని అధికారులకు సూచించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పోలీస్ అధికారులతో స్థానిక శాంతి భద్రతలపై సమీక్ష సమావేశం ఆదివారం రాత్రి జనగాం లో జరిగింది. ఈ సందర్భంగా డిజిపి బి శివధర్ రెడ్డి వరంగల్ పోలీస్ కమిషనర్ పరిధిలోని పరిస్థితులను సమీక్షించి తగు సూచనలు చేశారు. ఆదివారం నాడు డిజిపి నిర్వహించిన సమీక్షా సమావేశాలలో మల్టీ జోన్ –1 ఐజీపీ ఎస్ .చంద్రశేఖర్ రెడ్డి, ఖమ్మం సిపి సునీల్ దత్, వరంగల్ సి పి సన్‌ప్రీత్ సింగ్ తో పాటు పలువురు పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు రాష్ట్రానికి రాహుల్

**తెలంగాణ పర్యటనకు రానున్న కాంగ్రెస్ అగ్రనేత**
**వికారాబాద్‌లో జరుగుతున్న డీసీసీ అధ్యక్షుల శిక్షణ తరగతులకు హాజరుకానున్న కాంగ్రెస్ అగ్రనేత**
**తాజా రాజకీయపరిణామాలు, పార్టీబోపేతంపై చర్చించే అవకాశం**

హైదరాబాద్ :కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ రేపు తెలంగాణ రాష్ట్రానికి రానున్నారు. వికారాబాద్?లో జరుగు?తున్న డీసీసీ అధ్యక్షుల శిక్షణ తరగతులకు ఆయన హాజరవ్వనున్నారు. ఉదయం 9 గంటల 20 నిమిషాలకు శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకోనున్న ఆయన అక్కడ నుంచి హెలికాప్టర్?లో వికారాబాద్?కు చేరుకుంటారు. ఉదయం 10.30 నుంచి నాలుగున్నర వరకు అక్కడి హరిత రిసార్ట్స్?లోనే ఉంటారు. ఈ సమావేశంలో తాజా రాజకీయ పరిణామాలు, పార్టీ బలోపేతం తదితర అంశాలు సహా రాజ్యసభ సభ్యుల ఎంపికపై చర్చించనున్నట్లుగా తెలుస్తోంది. ఇటీవల వనం వీడి జనంలోకి వచ్చిన మాజీ మావోయిస్టు అగ్రనేతలతో రాహల్?గాంధీ సమావేశం అయ్యే అవకాశం ఉంది. సాయంత్రం 5 గంటలకు తిరిగి ఢిల్లీ బయలుదేరనున్నారు. మీనాక్షి నటరాజన్ అధ్యక్షతన జరిగే పీఏసీ సమావేశానికి రాహుల్ గాంధీ హాజరవ్వనున్నట్లుగా తెలుస్తోంది. రాహుల్‌గాంధీ పర్యటన నేపథ్యంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు.ఇవాళ కాంగ్రెస్ సమన్వయ కమిటీ సమావేశం : రాష్ట్ర కాంగ్రెస్ సమన్వయ కమిటీ ఇవాళ సమావేశం కానుంది. పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, సీతక్క పాల్గొననున్న ఈ సమావేశంలో రాజ్యసభ సభ్యుల ఎంపికపై చర్చిస్తారు. రాజ్యసభ సీట్ల కోసం పోటీ పడుతున్న నాయకుల గురించి చర్చించే క్రమంలోనే సామాజిక సమీకరణాలు, విధేయత, ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు. ఇప్పటివరకు ఏయే సామాజిక వర్గాలకు ఏయే పదవులు పొందారనే అంశంతోపాటు పార్టీ కోసం కమిట్మెంట్?తో పని చేస్తూ ఎలాంటి పదవులు పొందని నాయకులు ఎవరెవరు ఉన్నారనే విషయాలను పరిశీలించి ఏ సామాజిక వర్గాలు పదవులకు దూరంగా ఉన్నాయి. తదితర అంశాలపై చర్చించనున్నట్లుగా తెలుస్తోంది. రేపు రాహుల్?గాంధీ పర్యటన నేపథ్యంలో పలు అంశాలు చర్చకు వచ్చే అవకాశం ఉంది. డీసీసీ అధ్యక్షులకు శిక్షణ కార్యక్రమం : వికారాబాద్?లో ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన డీసీసీ అధ్యక్షులకు పదిరోజుల శిక్షణ కార్యక్రమం ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించిన విషయం తెలిసిందే. అనంతరం ఆయన ప్రసంగించారు. ఈ సందర్భాంగా పార్టీ కార్యకర్తలకు పలు కీలక సూచనలు చేశారు. ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల హాజరై ప్రసంగించారు. ఈ సమావేశంలో నాయకత్వ నైపుణ్యాలు, ఎన్నికల వ్యూహాలు, మీడియా నిర్వహణ తదితర అంశాలపై శిక్షణను అందిస్తున్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ రేపు ఈ సమావేశానికి రానున్నారు.గౌరవం, మర్యాద తప్పక పెరుగుతుంది : డీసీసీ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రేవంత్ రెడ్డి పార్టీ నాయకులను ఉద్దేశించి మాట్లాడుతూ పైరవీల కోసం తిరిగితే ప్రజల్లో, పార్టీలో చులకన అవుతారని సూచించారు. అలాంటి వాటిని వదిలేసి ప్రజల తరఫున పోరాడినట్లయితే గౌరవం, మర్యాద తప్పక పెరుగుతుందని అన్నారు. సొంత అజెండా వదిలేసి ప్రజా అజెండా, పార్టీ అజెండా కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమస్యలపై కొట్లాడితే స్వపక్షంతో పాటు విపక్షం కూడా గౌరవిస్తుందని చెప్పారుహస్తం పార్టీలో తొలి నుంచి భిన్నాభిప్రాయాలు వెలువరించే సంస్కృతి, స్వేచ్ఛ ఉందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. భిన్నాభిప్రాయాలు చెప్పినంత మాత్రాన వారిని వేధించే సంస్కృతి తమ పార్టీలో లేదన్నారు. మనలో మనం కొట్లాడుకుంటే పార్టీ కోసం కష్టపడే లక్షలాది కార్యకర్తలకు అన్యాయం చేసిన వాళ్లం అవుతామని పార్టీ నాయకులను ఉద్దేశించి అన్నారు.

## నాణ్యమైన తీర్పులతో న్యాయ వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం

న్యాయం జరుగుతుందని ఇరుపక్షాలకు నమ్మకం ఉండాలి. న్యాయవ్యవస్థపై ఎంతో నమ్మకంతోనే ప్రజలు కోర్టులకు వస్తున్నారు. కొన్ని కేసుల్లో కోర్టులు కూడా మధ్యవర్తిత్వాన్ని ప్రోత్సహించాలి. మధ్యవర్తిత్వం ఇవాళ ప్రపంచవ్యాప్తంగా పెరుగుతోంది. దీనివల్ల కలిగే ప్రయోజనాలను అనేక దేశాల్లో చూశాను. మలేషియాలోని లీగల్ బార్ కీలకంగా వ్యవహరిస్తోంది. మనదేశంలో ప్రతిస్థాయిలోనూ మధ్యవర్తిత్వం రావాలి" అని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ అన్నారు.అంతకు ముందు సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌కు ఇవాళ చరిత్రాత్మకమైన రోజు అని అన్నారు. రాజధాని అమరావతి గురించి సీజేఐ జస్టిస్ సూర్యకాంత్‌కు వివరించినట్లు తెలిపారు. " అమరావతిని గొప్ప నగరంగా నిర్మిస్తున్నాం. మన దేశానికి యువత, టెక్నాలజీ పెద్ద బలం. 2047 నాటికి భారత్ నెంబర్‌వన్ ఆర్థిక వ్యవస్థగా మారుతుంది." అని అన్నారు.

**ఏపీ జ్యుడీషియల్ అకాడమీకి సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ శంకుస్థాపన**

అమరావతి వేదికగా న్యాయ వ్యవస్థలో మరో కీలక అడుగు పడింది. పిచ్చుకలపాలెం వద్ద ఏపీ జ్యుడీషియల్ అకాడమీకి సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ శంకుస్థాపన చేశారు. రూ.165 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో అకాడమీ నిర్మాణం చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, పలువురు సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు పాల్గొన్నారు.మొత్తం 2.05 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో అకాడమీ నిర్మాణం చేపడుతున్నారు. ఒకేసారి 120 మంది ట్రైనీ జడ్జిలకు శిక్షణ ఇచ్చేలా రూపకల్పన చేశారు. 500 సీట్ల సామర్థ్యంతో అత్యాధునిక ఆడిటోరియం, జీ ప్లస్ 8 అంతస్తులతో భారీ హాస్టల్ బ్లాక్ నిర్మించనున్నారు. మరోవైపు అమరావతిలో హైకోర్టు జడ్జిల అతిథిగృహానికి సీజేఐ శంకుస్థాపన చేశారు.

# శ్రీ జయ శ్లోక హై స్కూల్ లో పదవ తరగతి ఫేర్వెల్ సెలబ్రేషన్స్ "శుభం





**ఖమ్మం ప్రతినిధి, మార్చి 1 (భద్రాద్రిన్యూస్ ):-**
ఫేర్వెల్ సెలబ్రేషన్స్ 2025-26" అనే పేరుతో చాలా ఘనంగా జరిగాయి . జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైన కార్యక్రమం ఆధ్యంతం ఎంతో ఆహ్లాదభరితంగా జరిగింది. వేద పండితులైన యడవల్లి సత్యంబాబు దంపతుల చే విద్యార్థులకు మంచి మార్కులు రావాలని, వారి తల్లిదండ్రులకి, స్కూల్ కి మంచి పేరు రావాలని వేదాశీర్వచనం చేయించారు. తదుపరి విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహ్లాదాన్ని పంచాయి. 10 వ తరగతి విద్యార్థులు తమ అనుభవాన్ని, తమ ఆశయాలను పంచుకున్నారు. వారి తల్లిదండ్రులు స్కూల్ ఇస్తున్న సహకారానికి, ప్రిపరేషన్ విధానాన్ని మెచ్చుకున్నారు. తమ అలానే స్కూల్ కూడా మంచిగా ఇంకా చాలమంది విద్యార్థులకు విద్యని అందించాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు నిర్వహించిన ఫన్ గేమ్స్ లో పిల్లలు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎంతో కష్టపడి చదువుతున్న వారికి ఈ గేమ్స్ ఎంతో సంతోషాన్ని, ఉత్సాహాన్ని నింపాయి. 10 వ తరగతి ఉపాధ్యాయులు పిల్లలతో తమ ఆలోచనలని పంచుకున్నారు. పిల్లలు జీవితంలో ఎంతో ఎత్తుకు ఎదగాలని కోరుకున్నారు . కసితో చదవాలని పట్టుదలతో ఏదైనా సాధించవచ్చని వారిలో ఉత్సాహాన్ని నింపారు. చివరిగా పాఠశాల ప్రిన్సిపాల్, సెక్రటరీ ఽ కరస్పాండెంట్ షిఫాలి జగదీష్ శర్మ మాట్లాడుతూ ప్రస్తుత పదవ తరగతి విద్యార్థులు తమ మొదటి బ్యాచ్ అని, వారు ఎంతో క్రమశిక్షణ కలిగిన వారని, టీచర్స్ చెప్పిన విషయాలు చక్కగా అర్థం చేసుకొని స్ట్రెస్ తీసుకోకుండా మంచిగా చదువుతున్నారని, వారు వారి పేరెంట్స్ కి, స్కూల్ కి మంచి పేరు తీసుకోవస్తారని, భవిష్యత్తులో ఎంతో గొప్పవారవుతారని మెచ్చుకున్నారు మరియు ఆశీర్వదించారు. ఎప్పుడైనా తమ స్కూల్ వచ్చి ఆనందంగా మమ్మలని పలకరించవచ్చని, జీవితంలో ఎంత ఎత్తు ఎదిగినా భారతీయులుగా గర్వించాలని, జీవించాలని, ఈ దేశానికి తమకు చేతనైనది చేయడానికి ముందుండాలి అని అన్నారు. ఇది మొదటి బ్యాచ్, ఈ ఫేర్వెల్ ఒక ఎమోషన్ అని భావోద్వేగానికి గురయ్యారు. విద్యార్థులకు జూనియర్స్, టీచర్స్ , పాఠశాల తరపున గిఫ్ట్స్ అందించారు. హై స్కూల్ విద్యార్థులందరూ , వారి పేరెంట్స్ పాల్గొండం జరిగింది. అందరికీ కృతజ్ఞలతో కార్యక్రమం ముగించారు.

# మరోసారి ప్రజాబంధువు గా బడుగు బలహీన వర్గాలకు అండగా మానవత్వాన్ని చాటుకున్న పల్లా కిరణ్










**ఖమ్మం ప్రతినిధి, మార్చి 1 (భద్రాద్రిన్యూస్ ):-**
లిపీడిత ప్రజల నాయకులు, పేదల పక్షపాతి స్వర్గీయ క్రీ. శే. పల్లా జాన్ రాములు కుమారుడు ప్రముఖ సమాజ సేవకులు, యువ నాయకులు పల్లా కిరణ్ ఆధ్వర్యంలో "ఉచిత మెగా కంటి వైద్య శిబిరం" "రక్తదాన శిబిరానికి" భారీ స్పందన తో విజయవంతమైంది ఖమ్మం ప్రముఖ మిషన్ హాస్పిటల్ ప్రాంగణం లో పల్లా కిరణ్ చే నిర్వహించబడిన లి"ఉచిత మెగా కంటి వైద్య శిబిరము" రక్తదాన శిబిరం భారీగా విజయవంతమైంది.ఈ శిబిరానికి సుమారు 1000 మందికి పైగా కంటి సమస్యలతో బాధపడుతున్న పేద, మధ్య తరగతి ప్రజలు పాల్గొని, నిపుణులైన డాక్టర్ల తో వైద్యం చేయించుకున్నారు. వీరికి ఉచితంగా కంటికి సంబంధించిన మందులు మరియు కళ్ళజోళ్ళు పల్లా కిరణ్ ఉచితంగా అందజేశారు.పల్లా కిరణ్ పిలుపుతో పెద్దఎత్తున దాతలు రక్తదానం చేశారు.ఈ రక్తదాన శిబిరం లో దాతలు ఇచ్చిన రక్త యూనిట్స్ ని సేకరించి, లినిరుపేదలకు ఉపయోగపడే విధంగా పల్లా కిరణ్ గవర్నమెంట్ హాస్పిటల్ కి అందజేశారు.ఈ మెగా కంటి వైద్య శిబిరానికి "వాసన్ ఐ కేర్" నుంచి నిపుణులైన వైద్యులు, సిబ్బంది వారి సేవలను అందించారు. ఈ సందర్భంగా పల్లా కిరణ్ మాట్లాడుతూ, గత 20 సంవత్సరాలుగా వివిధ వర్గాల ప్రజల కోసం అనేక సేవా కార్యక్రమాలు ఉదాహరణకు సంవత్సరానికి 2 రెండు సార్లు ఉచిత మోగా వైద్య శిబిరం నిర్వహించుట, కరోనా సమయంలో 3000 మందికి మామిడికాయ పచ్చడి పంపిణీ, ప్రైవేటు టీచర్స్ , పేదలకు బియ్యం, నిత్యవసర సరుకులు పంపిణీ, వరదల సమయంలో నిత్యం అందుబాటులో ఉంటూ వరద బాధితులకు ఆహారం, నీరు, నిత్యవసర సరుకులు మరియు బట్టలు పంపిణి ఇలా అన్ని వర్గాల ప్రజలకు అనేక సందర్భాల్లో అన్న దానాలు, నిరుపేద విద్యార్థిని, విద్యార్థులకు ప్రాథమిక మరియు ఉన్నత విద్య కొరకు ఆర్థిక సహాయం. వృద్ధులకు, వికలాంగులకు, మహిళలకు, అనాథ బాలబాలికలకు , యువతకు నిత్యం అనేక విధాలుగా అండగా ఉంటూ సహాయ సహకారాలు అందిస్తు అండగా ఉండడం సంతోషంగా ఉన్నదని వ్యక్తం చేశారు.

# నివారణాత్మక పోలీసింగ్‌పై దృష్టి

**- తెలంగాణ రాష్ట్ర డీజిపి శివధర్ రెడ్డి**
**- సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల నివారణ, మాదకద్రవ్యాల మూలాలపై దృష్టి, సరిహద్దు రాష్ట్రాల నుంచి ఇసుక అక్రమ రవాణా పూర్తిస్థాయిలో కట్టడి**
**- పోలీస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్, పోలీస్ గృహ భవనాలను ప్రారంభించిన డిజిపి**





**ఖమ్మం ప్రతినిధి, మార్చి (1 భద్రాద్రి న్యూస్ ):**
నివారణాత్మక పోలీసింగ్‌పై దృష్టి సారించాలని తెలంగాణ రాష్ట్ర డీజిపి బి. శివధర్ రెడ్డి అన్నారు. ఖమ్మం జిల్లాలో పర్యటన సందర్భంగా ఆదివారం పోలీస్ హెడ్ క్వార్టర్స్ కు చేరుకున్న రాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డి ముందుగా సాయిధ పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించారు. మల్టీ జోన్ ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి, పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతంపలికారు. పోలీస్ హెడ్ క్వాటర్స్ లో నిర్మించిన పోలీస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ అదేవిదంగా అత్యాధునిక సదుపాయాలతో నిర్మించిన పోలీస్ గృహ భవనాలను మల్టీ జోన్ ఐజిపి చంద్రశేఖర్ రెడ్డి తో కలసి డిజిపి ప్రారంభించారు.పోలీస్ సంక్షేమ కార్యక్రమంలో భాగంగా నిర్మించిన పోలీస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్, పోలీస్ ఫ్యామిలీ గృహ భవనాలను పరిశీలించారు. టెన్నిస్, పికిల్ బాల్, షటిల్ కోర్ట్, నిర్మిస్తున్న ఈ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ద్వారా పోలీస్ సిబ్బంది, పోలీస్ పిల్లలను ఉత్తమ క్రీడాకారులను చేయడం లక్ష్యంగా నిర్మితమైతుందని అన్నారు. అదేవిదంగా నిత్యం విధినిర్వహణలో ఉండే తెలంగాణ పోలీస్ సిబ్బంది కుటుంబాలకు మెరుగైన వసతి కల్పించడం ద్వారా పోలీస్ సిబ్బంది పనితీరును మరింత మెరుగుపరచే ఉద్దేశంతో జిల్లా కేంద్రంలో అత్యాధునిక సదుపాయాలతో నిర్మించిన పోలీస్ గృహ భవనాలను నిర్మించామని డిజిపి తెలిపారు. అనంతరం పోలీస్ శిక్షణ కేంద్రంలో పోలీసు అధికారులతో నేర సమీక్ష సమావేశంలో పాల్గొని జిల్లా వ్యాప్తంగా నేర గణాంకాలు, ముఖ్య కేసుల దర్యాప్తు పురోగతి, శాంతి భద్రతా చర్యలు, మహిళలు, శిశువుల భద్రత, సైబర్ నేరాల, రోడ్డు ప్రమాదాలు, మాదకద్రవ్యాల నియంత్రణ, ఇసుక అక్రమ రవాణా పై చేపడుతున్న చర్యలు, పలు అంశాలపై విస్తృత సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా డీజిపి మాట్లాడుతూ..తెలంగాణ పోలీసుశాఖకు దేశంలోనే మంచి పేరుందని, ఇతర రాష్ట్రాలతో పోల్చితే నేరాల నియంత్రణలోనూ.. సాంకేతిక పరిజ్ఞానం వినియోగంలోనూ ముందువరుసలో ఉన్నామని తెలిపారు. సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల మరణాలు, మాదకద్రవ్యాలు...ఇప్పుడు తెలంగాణ సమాజం ముందున్న పెనుసవాళ్లని వీటి నియంత్రణ కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంస్థలు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్బీ), ఈగల్ దేశంలోనే అత్యున్నతంగా పనిచేస్తున్నాయని అన్నారు. డ్రగ్స్ ముఠాలు తెలంగాణ నుండి వెళ్లిపోయేలా చేయడంలో కీలకంగా వ్యవహరించిందన్నారు. "పదేళ్ ్లగా సైబర్ నేరాలు గణనీయంగా పెరుగుతున్నాయని, ఇది సాధారణ సమస్య కాదని పేర్కొన్నారు. స్వీయ అవగాహనతోనే సైబర్ మోసాలకు కళ్లెం వేసేందుకు ఇంటి గుమ్మం వద్దకు ప్రచారాన్ని తీసుకెళ్లాలనే లక్ష్యంతో హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ రూపొందించిన 'సైబర్ సింబా' కార్యక్రమం జిల్లాలో అమలు చేయడం ద్వారా సైబర్ నేరాల నివారణ చర్యలు చేపట్టాలన్నారు.రోడ్డు ప్రమాదాలు తీవ్ర సమస్యగా మారుతోందని, రోడ్డు ప్రమాదాల విషయంలో దారుణమైన రికార్డులు నమోదు అవుతున్నాయని, ప్రతి సంవత్సరం వేలాది మంది యువత మరణిస్తున్నారని, ఇది తీవ్ర ఆందోళనకరమైన సమస్య అని అన్నారు. ఇంటి నుండి బయటకు వెళ్లిన వ్యక్తులు సురక్షితంగా ఇంటికి చేరాలని లక్ష్యంతో చేపట్టిన అరైవ్ అలైన్ కార్యక్రమాన్ని ప్రజల్లో విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. ఇప్పటికే రోడ్డు ప్రమాదాలపై సీరియస్ దృష్టి సారించిన రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని కూడ అన్ని శాఖల సమన్వయంతో ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని సంకల్పంతో మార్చి 25 నుండి 31 వరకు అరైవ్ అలైవ్ కార్యక్రమం నిర్వహిస్తునట్లు తెలిపారు. మాదకద్రవ్యాల రవాణాను ఏమాత్రం సహించబోమని, గంజాయి వంటి మాదకద్రవ్యాలపై తనిఖీలు, నిఘా పెరగటంతో ముఠాలు ప్రత్యామ్నాయ మార్గాలలో వెళ్లేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, కట్టడి చేసేందుకు ప్రత్యేక బృందాలు సిద్ధంగా ఉన్నాయని అన్నారు.బేసిక్ పోలీసింగ్, చట్టాలపై లోతైన అవగాహన కోసం దృష్టి పెట్టాలని, పోలీస్ స్టేషన్ రికార్డు నిర్వహణ సక్రమంగా నిర్వహించాలని, దర్యాప్తు నాణ్యతను మరింత మెరుగుపరచాలని, ప్రజలకు వేగంగా న్యాయం అందించేలా పోలీసు యంత్రాంగం మరింత సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. సమావేశంలో పాల్గొన్న పోలీస్ కమిషనర్ సునీల్ దత్ జిల్లా నేర ధోరణులు, పెండింగ్ కేసుల స్థితి, ముఖ్య విచారణల పురోగతి, నేర నియంత్రణకు అమలు చేస్తున్న ప్రత్యేక చర్యల వివరాలు డీజీపీకి వివరించారు.కార్యక్రమంలో అడిషనల్ డీసీపీలు ప్రసాద్ రావు, రామానుజం, కుమారస్వామి, విజయబాబు ఏసీపీ రమణమూర్తి, తిరుపతి రెడ్డి,సారంగపాణి, శ్రీనివాసులు, మహేష్, సర్వర్, సత్యనారాయణ, ఫణిందర్, సుశీల్ సింగ్, నర్సయ్య ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఎస్సీ బాలుర హాస్టల్ (బి), ఖమ్మం లో పేరెంట్స్ కమిటీ సమావేశం





**ఖమ్మం ప్రతినిధి మార్చి 1 (భద్రాద్రిన్యూస్):**
ఖమ్మం నగరంలోని ప్రభుత్వ ఎస్సీ బాలుర హాస్టల్ (బి), లో ఆదివారం పేరెంట్స్ కమిటీ సమావేశం ఘనంగా నిర్వహించబడింది. వసతి గృహ సంక్షేమ అధికారి కోటపాటి రుక్మారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో విద్యార్థుల సమగ్ర అభివృద్ధిపై విస్తృతంగా చర్చించారు. సమావేశంలో విద్యార్థుల హాజరు శాతం, క్రమశిక్షణ, విద్యా పురోగతి, ఇటీవల నిర్వహించిన పరీక్షల ఫలితాలు, ఆరోగ్య పరిస్థితులు, హాస్టల్ పరిశుభ్రత, పోషకాహారం నాణ్యత మరియు భద్రతా ఏర్పాట్లపై తల్లిదండ్రులకు వివరించారు. తక్కువ మార్కులు సాధించిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని అదనపు బోధన, మార్గదర్శకత్వం అందిస్తామని తెలిపారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి తల్లిదండ్రుల పాత్ర కీలకమని పేర్కొంటూ, ప్రతి నెల కనీసం ఒకసారి హాస్టల్‌ను సందర్శించి పిల్లల చదువు, ప్రవర్తనపై పర్యవేక్షణ చేయాలని విజ్ఞప్తి చేశారు. హాస్టల్ సిబ్బంది మరియు తల్లిదండ్రుల సమన్వయంతోనే విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించగలరని అభిప్రాయపడ్డారు. విద్యార్థులకు అందిస్తున్న పౌష్టికాహార మెనూ, వసతి సదుపాయాలు మరియు ఇతర సంక్షేమ కార్యక్రమాలపై కూడా చర్చ జరిగింది. సమావేశానికి హాజరైన తల్లిదండ్రులకు భోజన వసతి కల్పించారు.ఈ కార్యక్రమంలో నాలుగో తరగతి సిబ్బంది నరేష్, తిరుపతిరావు, వెంకన్న, శంకర్ తదితరులు పాల్గొన్నారు. అధిక సంఖ్యలో తల్లిదండ్రులు మరియు విద్యార్థులు హాజరైనారు.

# జాతీయ పారా టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్‌లో ఖమ్మం కుర్రాడి సత్తా



**ఖమ్మం ప్రతినిధి, మార్చి 1 (భద్రాద్రి న్యూస్):**
ఇండియా 15వ ర్యాంకర్‌గా నిలిచిన రెడ్డి సాయి మధ్యప్రదేశ్ రాష్ట్రం ఇండోర్‌లో ఈనెల 26 నుంచి 28 వరకు నిర్వహించిన జాతీయ స్థాయి పారా టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్‌లో ఖమ్మం జిల్లాకు చెందిన క్రీడాకారుడు రెడ్డి సాయి శివ అద్భుత ప్రతిభ కనబరిచారు. స్థానిక సర్దార్ పటేల్ స్టేడియం టేబుల్ టెన్నిస్ అకాడమీలో శిక్షణ పొందుతున్న సాయి శివ, ఈ టోర్నీలో రాణించి ఆల్ ఇండియా 15వ ర్యాంకును కైవసం చేసుకున్నారు.జిల్లా క్రీడా అధికారి (ఈూా) ప్రశంసలుఈ విజయంపై జిల్లా క్రీడా అధికారి సునీల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. "ఖమ్మం క్రీడాకారులు జాతీయ స్థాయిలో తమ ముద్ర వేయడం శుభపరిణామం. సాయి శివ పట్టుదలతో ఆడి దేశవ్యాప్తంగా 15వ ర్యాంకు సాధించడం అభినందనీయం. పారా అథ్లెట్లకు జిల్లా క్రీడా శాఖ తరపున ఎల్లప్పుడూ పూర్తి సహకారం ఉంటుంది. భవిష్యత్తులో సాయి శివ మరిన్ని అంతర్జాతీయ పతకాలు సాధించి జిల్లాకు, రాష్ట్రానికి పేరు తీసుకురావాలి" అని ఆకాంక్షించారు.హర్షం వ్యక్తం చేసిన సంఘం ప్రతినిధులుసాయి శివ సాధించిన ఈ విజయం పట్ల టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. అభినందనలు తెలిపిన వారిలో:
- గౌరవాధ్యక్షులు: డాక్టర్ కురపాటి ప్రదీప్, కొండా శ్రీధర్ రావు, గుర్రం నరేంద్ర,డాక్టర్ సునీల్ కుమార్ జంగాల.
ఉపాధ్యక్షులు: పరిటాల చలపతి, షేక్ మజార్.
- సంయుక్త కార్యదర్శులు: ఆనం రాజేష్, గద్దల రామారావు, రాయపూడి సంతోష్, గాదే అశ్విన్, ఇలాప్రోలు లాలయ్య,
- ప్రతినిధులు: పిట్టల కామేశ్వరి, అనుమోలు శృతి, భవ్య చందు, తదితరులు ఉన్నారు.
అకాడమీలో లభించిన మెరుగైన శిక్షణ, సాయి శివ నిరంతర కృషి వల్లే ఈ ఘనత సాధ్యమైందని అసోసియేషన్ సభ్యులు కొనియాడారు.

# ఆపరేషన్ క్రాక్ డౌన్ -1.0 లో భాగంగా సైబర్ నేరస్తుడిని అరెస్టు చేసిన ఖమ్మం సైబర్ క్రైమ్ పోలీసులు



**ఖమ్మం ప్రతినిధి, మార్చి 1 (భద్రాద్రిన్యూస్ ):** ఆన్లైన్లోజాబ్ , షేర్ మార్కెట్ లో ట్రేడింగ్, ఇన్వెస్ట్మెంట్ లోడబ్బులు పెడితే ఎక్కువ లాభాలు వస్తాయని నమ్మించి, సుమారు 47 లక్షల రూపాయలు మోసం చేసిన కేసులో ఒకరిని ఖమ్మం సైబర్ క్రైమ్ పోలీసులు హైదరాబాద్ లో అరెస్టు చేసినట్లు పోలీస్ కమిషనర్ సునిల్ దత్ తెలిపారు. కేసు వివరాలలోకి వెళితే టి జి సి ఎస్ బి ,హైదరాబాద్ ఆద్వర్యంలో నిర్వహిస్తున్న ఆపరేషన్ క్రాక్ డౌన్ -1.0 లో భాగంగా ఖమ్మం జిల్లాకు చెందిన భాదితుడు కి వాట్సాప్,టెలీగ్రామ్ లలో పరిచయమై ఆన్లైన్ లో జాబ్ , షేర్ మార్కెట్ లో ట్రేడింగ్, ఇన్వెస్ట్మెంట్ చేస్తే అధిక లాభాలు చేసి మోసపోయిన కేసులో గాను మరియు వివిధ కేసులలో నిందితుడు గా ఉన్న అకౌంట్ హోల్డర్ అయిన ఎండి ఫిరోజ్ , 25 సం ను ,హైదరాబాద్ సిటీ పోలీస్ సహకారంతో హైదరాబాద్ లో అరెస్టు చేసి ఖమ్మం సైబర్ క్రైం కోర్టులో హాజరు పరిచి, రిమాండ్ కి తరలించినట్లు తెలిపారు. ఈ కేసు విచారణలో ముఖ్య పాత్ర వహించిన సైబర్ క్రైమ్ డి. ఎస్పీ, సిహెచ్ ఆర్వి . ఫణిందర్ ని,ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ కొండపర్తి నరేశ్ , ఎస్సై లు రశీజిత్ కుమార్ , విజయకుమార్ లను, ఎచ్. సి ప్రసాద్ ,కానిస్టేబుల్ కృష్ణ ప్రసాద్ మరియు సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ సిబ్బందిని ఖమ్మం సిపి సునీల్ దత్, అభినందించారు.

# శ్రీ రాగా స్కూల్ 21వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహణ

**- కరస్పాండెంట్ మల్లారపు వరప్రసాద్, డైరెక్టర్ కవితలను అభినందించిన ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**





**భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 1 (భద్రాద్రి న్యూస్):** స్థానిక కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని మేదరబస్తిలో గల శ్రీ రాగా ప్లే అండ్ హై స్కూల్‌లో 21వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబ శివరావు హాజరయ్యారు. గౌరవ అతిథులుగా 53వ డివిజన్ కార్పొరేటర్ బండి నరసింహ రావు, 52వ డివిజన్ కార్పొరేటర్ బానోత్ కళావతి, 30వ డివిజన్ కార్పొరేటర్ గుమ్మడెల్లి దుర్గా (బ్యాండ్ దుర్గ), మాజీ ఉపసర్పంచ్ లగడపాటి రమేష్, బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముదురకోళ్ల కిషోర్, మాజీ కౌన్సిలర్ చారి, మేరెల్ల రమేష్, టి. రాజశేఖర్ (వైస్ ప్రిన్సిపాల్, ఎక్సలెంట్ స్కూల్ మణుగూరు) పాల్గొన్నారు. ప్లే స్కూల్ చిన్నారుల ఫ్యాన్సీ డ్రెస్సులు, యూకేజీ విద్యార్థుల అన్యువల్ రిపోర్ట్ స్పీచ్, "సేవ్ వాటర్" మైమ్, 8వ తరగతి విద్యార్థుల శివతాండవం, "యమలీల" హాస్యనాటిక ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. 2025 విద్యా సంవత్సర టాపర్లకు ఎమ్మెల్యే గారి చేతుల మీదుగా గోల్డ్ మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ మల్లారపు వరప్రసాద్, డైరెక్టర్ కవిత అతిథులను శాలువాలు, పూల బొకేలతో సన్మానించారు. ఎమ్మెల్యే శ్రీ రాగా స్కూల్ అభివృద్ధిని ప్రశంసిస్తూ యాజమాన్యం, స్టాఫ్‌ను అభినందించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు ఈ కార్యక్రమంలో శ్రీ రాగా స్టాఫ్ సర్వేశ్వర రావు,రాంబాబు,రాజ్ కుమార్,అనుష,కవిత,రేష్మా,భువన,శ్రావణి,అన్నపూర్ణ,అనుష,పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేద ఆదివాసీ కుటుంబానికి సుమంత్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో చేయూత



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా.జూలూరుపాడు మండలం,**
**భద్రాద్రి న్యూస్ రిపోర్టర్. మార్చి 1:** యూసఫ్:
జూలూరుపాడు మండలం, గుండెపుడి గ్రామ పంచాయతీ రాంచంద్రపురం గ్రామంలో ఇటీవలే పూనెం రుక్కమ్మ (గుమ్మస్తా అక్క ) మరణించారు. ఆ కుటుంబానికి దుద్దుకూరి సుమంత్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ఒక క్వింటా బియ్యం కర్మ కాండలకు అందించారు. కష్టాల్లో ఉన్న వారికీ తోడుగా ఉండటమే తన లక్ష్యం అని, అదే తన సంతోషం అని దుద్దుకూరి సుమంత్ అన్నారు. ఆ కుటుంబానికి తోడుగా ఉన్న పెద్దలకు కూడా ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమం లో గ్రామ పెద్దలు కాళ్ళూరి వెంకటేశ్వరావు, మాజీ సొసైటీ అధ్యక్షులు కొమ్మినేని కృష్ణమూర్తి, కొమ్మినేని పాండురంగరావు, యండపల్లి చిట్టిబాబు, కాళ్ళూరి ప్రవీణ్, వాడె నర్సింహారావు, ముక్తి లక్ష్మి, ఇర్ప నగేష్, పూనెం నవీన్, భూక్యా తరుణ్, పూనెం సత్యాలు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# దశదినకర్మకు హాజరైన కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మోదుగు రామకృష్ణ,



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం**
**భద్రాద్రి న్యూస్ రిపోర్టర్ మార్చి 1యూసఫ్:**
. జూలూరుపాడు మండల కేంద్రం లో తంబర్ల నరసింహారావు గారి. తల్లిగారు అనారోగ్యంతో మరణించినారు . ఈరోజు వారి స్వగ్రహం నందు . వారి దశదినకర్మకు. హాజరై వారి చిత్రపటానికి పూలు వేసి ఘన నివాళులు అర్పించిన. కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మోదుగు రామకృష్ణ, పోతురాజు నాగరాజు, విద్యుత్ కాంట్రాక్టర్, వేపూరి నరసింహారావు గారు, మంద సురేష్, మిరియాల ఫ్రాన్సిస్, కిన్నెర దేవయ్య, సతవరపు ప్రవీణ్, మంద గోపయ్య, తదితరులు పాల్గొన్నారు.

# 15లోపు పట్టాలిస్తాం.. ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తాం!

- 'మీ కన్నీరు తుడిచే బాధ్యత నాది.. మీకు అండగా నిలుస్తాం'
- వెలుగుమట్ల నిర్వాసితులకు మంత్రి పొంగులేటి అభయం
- దళారుల 'దగా'పై ఉక్కుపాదం.. బాధితులకు 'సర్కారు' దన్ను
- పదేళ్లు కళ్లు మూసుకుని.. ఇప్పుడొచ్చి మొసలి కన్నీరా?
- ప్రతిపక్షాలపై మీడియా సమావేశంలో మంత్రి పొంగులేటి ధ్వజం





**ఖమ్మం ప్రతినిధి ,మార్చి 1 (భద్రాద్రిన్యూస్ ) :-** అప్పులు చేసి నిర్మించుకున్న ఆశల గూడు కూలిపోయిందని ఆవేదన చెందకండి.. ఈ ప్రభుత్వం మీది. మీ కన్నీరు తుడిచే బాధ్యత నాది. అర్హులైన ప్రతి పేదవాడికి ఈ నెల 15వ తేదీలోపు ఇళ్ల స్థలాల పట్టాలతో పాటు రూ. 5 లక్షల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి వెలుగుమట్ల బాధితులకు భరోసానిచ్చారు. ఆదివారం ఖమ్మం ఐడిఒసి వేదికగా జరిగిన బాధితుల ముఖాముఖిలో మంత్రి వారి కష్టాలను స్వయంగా విని చలించిపోయారు.

**దళారుల నుంచి డబ్బులు వసూలు చేయించి ఇస్తామని హామీ**

వెలుగుమట్ల భూదాన్ భూముల్లో కొన్నేళ్లుగా దళారుల ఉచ్చులో చిక్కి, నిరుపేదలు అనుభవిస్తున్న నరకయాతన మంత్రి ఎదుట వెలుగుచూసింది. తక్కువ ధరకే స్థలం వస్తుందని నమ్మి, రెక్కాడితే గానీ డొక్కాడని తాము రూ. 30 వేల నుంచి రూ. 8 లక్షల వరకు అప్పులు చేసి దళారులకు చెల్లించామని మంత్రి ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. తీరా ఇల్లు కట్టుకున్నాక అధికారులు వచ్చి కూల్చేయడంతో తామంతా దిక్కుతోచని స్థితిలో పడ్డామన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి ఒక్క పైసా కూడా ఎవరికీ లంచం ఇవ్వాల్సిన పనిలేదని, పేదల రక్తం తాగిన ఆ దళారుల నుంచి డబ్బును రికవరీ చేయిస్తామని బాధితులకు గట్టి హామీ ఇచ్చారు.

**చీకటి బతుకుల నుంచి వెలుగు కాలనీల వైపు**

గత 9 నెలలుగా కరెంటు, నీరు, ఇతర మౌలిక సదుపాయాలు లేక చీకట్లో మగ్గుతున్నామని బాధితులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన మంత్రి... కేవలం ఇళ్ల స్థలాల పట్టాలు ఇవ్వడమే కాకుండా, కొత్తగా నిర్మించే కాలనీల్లో అన్ని మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. రోడ్లు, తాగునీరు, విద్యుత్, డ్రైనేజీతో పాటు అంగన్వాడీ, పాఠశాలలను ప్రభుత్వమే ఏర్పాటు చేస్తుందని వివరించారు. నియోజకవర్గాల వారిగా బాధితులను గుర్తించి, వారి వారి ప్రాంతాల్లోనే గౌరవప్రదమైన పునరావాసం కల్పిస్తామని స్పష్టం చేశారు.

**రాజకీయ శవాల మీద చిల్లర ఏరుకోవద్దు**

అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో... బాధితుల సానుభూతి కోసం పాకులాడుతున్న ప్రతిపక్ష నేతలపై మంత్రి పొంగులేటి నిప్పులు చెరిగారు. పది సంవత్సరాలు అధికారంలో ఉన్నప్పుడు ఈ పేదలు గుర్తుకు రాలేదా అని నిలదీశారు. అధికారం పోగానే షెడ్ల కింద కూర్చుని డ్రామాలు ఆడుతున్నారని, రాజకీయాల కోసం పేదలను కవచంలా వాడుకోవడం మూర్ఖత్వమని మండిపడ్డారు. మీ పార్టీ ఏదైనా సరే.. మీరు నిజమైన పేదలైతే ఈ ప్రభుత్వం మీకు ఇల్లు ఇచ్చి తీరుతుందని, రాజకీయాలకు అతీతంగా పారదర్శకమైన సర్వే ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేస్తామని ప్రకటించారు.

**అర్హులకే పట్టా.. మార్చి 15 'డెడ్ లైన్'**

గతంలో లబ్ధి పొందిన వారిని ఏరివేసి, కేవలం నిరుపేదలకే న్యాయం జరిగేలా సమగ్ర సర్వే నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 15వ తేదీన తానే స్వయంగా వచ్చి అర్హులైన కుటుంబాలకు ఇళ్ల స్థలాల పట్టాలు, ఇందిరమ్మ ఇళ్ల ఆర్డర్లు అందజేస్తానని మంత్రి భరోసా ఇచ్చారు. అధికారులే నేరుగా బాధితుల వద్దకు వస్తారని, మరోమారు మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సీపీ సునీల్ దత్, అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, మట్టా దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

# నేత్రపర్వంగా కరుణామయుని తిరు స్వరూప మహా ప్రదర్శన

- శిలువ మోస్తూ ప్రదర్శనలో పాల్గొన్న బిషప్ డాక్టర్ సగిలి ప్రకాష్
- ఖమ్మం ఆర్ సి ఎం చర్చి నుంచి కరుణగిరి చర్చి వరకు సాగిన తిరు స్వరూప వాహన యాత్ర.
- నేడు కరుణగిరి వేడుకలకు హాజరుకానున్న బిషప్ ల సంఘం జాతీయ అధ్యక్షులు కార్డినల్ బిషప్ డాక్టర్ పూల ఆంతోని




**పాలేరు, ,మార్చి 1(భద్రాద్రి న్యూస్):** కరుణగిరి పుణ్యక్షేత్ర మహోత్సవాలు పురస్కరించుకొని ఆదివారం కరుణామయని తిరు స్వరూపం మహా ప్రదర్శన నేత్రపర్వంగా జరిగింది. ఖమ్మం వైరా రోడ్డులోని ఆర్ సీఎం జాన్ మజ్జుకోని చర్చి నుంచి కరుణగిరి చర్చి వరకు ఈ మహా ప్రదర్శన కొనసాగింది. ఈ మహా ప్రదర్శనను ఉమ్మడి జిల్లా ఆర్.సి.యం బిషప్ డాక్టర్ సగిలి ప్రకాష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా బిషప్ డాక్టర్ సగిలి ప్రకాష్ మాట్లాడుతూ కరుణగిరి పుణ్యక్షేత్ర మహోత్సవాలలో భాగంగా ఈ మహా ప్రదర్శనను నిర్వహిస్తున్నామని తెలియజేశారు. కరుణామయుడైన ఏసుప్రభు దివ్య బోధనలు సర్వ మానవాళికి గొప్ప రక్షణను అందిస్తున్నాయని పేర్కొన్నారు. క్రీస్తు నిర్వహించిన అద్భుత కార్యాలు విశ్వాసుల్లో ప్రేరణను నింపుతున్నాయని తెలియజేశారు. క్రీస్తు ప్రభువు సిలువ శ్రమలను శ్రమలను ప్రతి ఒక్కరూ హృదయంలో ఉంచుకొని ఆయన చూపిన మార్గాన్ని అనుసరించాలని కోరారు. ఈ మహా ప్రదర్శన ప్రారంభ కార్యక్రమంలో మత గురువులు ఫాదర్ గొర్రెముచ్చు సురేష్, ఫాదర్ తలపునేని అంతోని , కరుణగిరి డైరెక్టర్ ఫాదర్ జ్యానేష్, కొమ్ము ప్రసాద్, ఎం ప్రసాద్, ఫాదర్స్ , సిస్టర్స్, విశ్వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఖమ్మం ఆర్ సి ఎం చర్చ్ నుండి ప్రారంభమైన మహా ప్రదర్శన పాత బస్టాండ్, మయూరి సెంటర్, ఓవర్ బ్రిడ్జ్,కాలవోడ్డు, ఎఫ్సీఐ గోడం, బైపాస్ రోడ్డు మీదుగా కరుణగిరి చర్చి వరకు సాగింది. ఈ ప్రదర్శనలో విశ్వాసులు ఆధ్యాత్మిక గేయాలు ఆలపిస్తూ ఏసుప్రభు నామాన్ని, మరియమాత నామాన్ని స్మరిస్తూ యాత్రలో పాల్గొన్నారు. కరుణగిరి పుణ్యక్షేత్ర వేదికపై విశ్రాంత బిషప్ మైపన్పాల్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం బిషప్ డాక్టర్ సగిలి ప్రకాష్ విశ్రాంత బిషప్ మైపన్ పాల్ ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మేత్రాసనం ఫైనాన్స్ అడ్మినిస్ట్రేటర్ ఫాదర్ సురేపల్లి ఐజక్ , ఫాదర్ వి జి శౌరి, కరుణగిరి డైరెక్టర్ జ్యానేష్, ఫాదర్ కొమ్ము ఆంతోనీ, ఫాదర్ జయరాజు, పలు నిర్వహణ సంఘాల బాధ్యులు , బ్రదర్స్, సిస్టర్స్ పాల్గొన్నారు.

**- నేడు హాజరుకానున్న బిషప్ ల సంఘం జాతీయ అధ్యక్షులు డాక్టర్ పూల అంతోని .**

జగద్గురువు పోప్ ఎన్నికలలో ఓటు హక్కు కలిగియున్న ఆలిండియా బిషప్ ల సంఘం జాతీయ అధ్యక్షులు , కార్డినల్ బిషప్ డాక్టర్ పూల అంతోని సోమవారం జరిగే కరుణగిరి పుణ్యక్షేత్ర మహోత్సవాల ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని ఉమ్మడి జిల్లా బిషప్ డాక్టర్ సగిలి ప్రకాష్ తెలియజేశారు. కార్డినల్ బిషప్ డాక్టర్ పూల ఆంతోని తొలిసారిగా కరుణగిరి పుణ్యక్షేత్ర వేడుకలలో పాల్గొంటున్నారని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన విశ్వాసులు పెద్ద సంఖ్యలో ఈ ముగింపు వేడుకలలో పాల్గొంటున్నారని బిషప్ డాక్టర్ సగిలి ప్రకాష్ తెలియజేశారు.







# సమాజ చైతన్యానికి సాహిత్యం దోహదం

-- ప్రముఖ సాహితీవేత్త మువ్వా శ్రీనివాసరావు
-- వైభవంగా 'అక్షరాలతోవ' 8వ వార్షికోత్సవ వేడుకలు
-- కథ, కవిత, వక్తృత్వ పోటీల విజేతలకు పురస్కారాల ప్రదానం

**ఖమ్మం ప్రతినిధి, మార్చి1 (భద్రాద్రి న్యూస్):**
సమాజ చైతన్యానికి సాహిత్యం దోహదం చేస్తుందని ప్రముఖ సాహితీవేత్త మువ్వా శ్రీనివాసరావు పేర్కొన్నారు. 'అక్షరాలతోవ' సాహితీ సంస్థ ఎనిమిదవ వార్షికోత్సవం ఖమ్మం లోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆదివారం 'అక్షరాలతోవ' నిర్వాహకులు నామా పురుషోత్తం అధ్యక్షతన జరిగింది. తొలుత కథలు, కవితలతో ప్రచురించిన పుస్తకాన్ని, జూలూరుపాడు మండలం పాపకొల్లు ఉన్నత పాఠశాల విద్యార్థి గార్లపాటి కృష్ణ మనోహర్ రచించిన 'ప్రకృతి సాయం' కథల పుస్తకాన్ని మువ్వా శ్రీనివాసరావు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ .. ఎనిమిది ఏండ్లుగా అక్షరాలతోవ సాహితీసేవ చేయడం అభినందనీయమన్నారు. ఏటేటా పోటీలు నిర్వహిస్తూ కవులను, రచయితలను ప్రోత్సహిస్తున్న అక్షరాలతోవను అభినందిస్తున్నానన్నారు. విద్యార్థులలో సాహితీ బీజాలు నాటడం, వారిలోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు పోటీలు నిర్వహించడం, బాల సాహిత్యం పట్ల అక్షరాలతోవ నిర్వాహకులు నామా పురుషోత్తం, దాసరోజు శ్రీనివాస్, రాచమళ్ల ఉపేందర్‌కున్న నిబద్ధతకు నిదర్శనమన్నారు. పోటీలు నిర్వహించడమే కాదు, విజేతలైన కవుల, రచయితల రచనలను ఏటేటా పుస్తకంగా వెలువరించడం గొప్ప విషయంగా భావిస్తున్నానన్నారు. సమాజ వికాసానికి అక్షరాలతోవ చేస్తున్న సాహితీ సేవకు సాహితీవేత్తలందరూ ప్రోత్సాహం అందించాలన్నారు. అనంతరం ప్రముఖ రచయిత్రి పురిమళ్ల సునంద మాట్లాడుతూ... కవిత్రయం చేస్తున్న సాహితీ సేవను అభినంస్తున్నానని, వారికి ప్రోత్సాహంగా తానెప్పుడూ ఉంటానని పేర్కొన్నారు. పరిశ సీతారత్నం ట్రస్టు వ్యవస్థాపకులు పరిశ పుల్లయ్య మాట్లాడుతూ.. ఎలాంటి లాభాపేక్ష లేకుండా సాహితీ సేవ చేస్తున్న నిర్వాహకులను అభినందిస్తున్నానన్నారు. మునుముందు కూడా వారికి తన ప్రోత్సాహం ఉంటుందన్నారు. ప్రముఖ కథా రచయిత మంత్రిప్రగడ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. అక్షరాలతోవ ద్వారా ఎంతోమంది కవులు గుర్తింపు పొందారని, వారిలో తానొకరినని పేర్కొన్నారు. ప్రముఖ రచయిత్రి తాళ్లూరి లక్ష్మి, బాల సాహితీవేత్త సయ్యద్ షఫీ, పొత్తూరి సీతారామారావు, నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఖమ్మం నగర అధ్యక్షులు యలమందల జగదీష్ ప్రసంగించారు. అనంతరం అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన కథల పోటీల విజేతలైన ఎనుగంటి వేణుగోపాల్, పొత్తూరు సీతారామరాజు, డాక్టర్ జడ సుబ్బారావు, మంత్రిప్రగడ శ్రీనివాసరావు లకు అక్షరాలతోవ నగదు పురస్కారాన్ని అందించారు. ఆదివారం అక్షరాభిషేకం పేరుతో వారం వారం నిర్వహించిన కవితా పోటీల విజేతలను ఘనంగా సన్మానించారు. వార్షికోత్సవం సందర్భంగా.. పలు పాఠశాలల్లో నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు మెమొంటో, సర్టిఫికెట్ అందజేసి సన్మానించారు. జిల్లాలో కళా రంగాల్లో విశేష సేవలు అందిస్తున్న కళాకారులు, గాయకులు మూసా, పాగి వెంకన్న, మొగిలి గుణకర్, కెవి చారి, నాగసాయి, మోదుగు గోవింద్, సదానందం, స్వప్నలకు మెమొంటో అందజేసి వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో అక్షరాలతోవ నిర్వాహకులు దాసరోజు శ్రీనివాస్, రాచమల్ల ఉపేందర్, ప్రముఖ కవులు దిలావర్, పోతగాని సత్యనారాయణ, కన్నెగంటి వెంకటయ్య, గద్దపాటి శ్రీనివాస్, ఐనాల సైదులు, ధరణికోట రమేష్, ఎం.వి రమణ, దేవయ్య, పగిడిపల్లి వెంకటేశ్వర్లు, కోండ్రు బ్రహ్మం, రేళ్ళ శ్రీనివాస్, పెద్దోజు నరేష్, ఇబ్రహీం నిర్గుణ్, పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.





# న్యాయవాదులకు తెలంగాణ ప్రభుత్వం అండగా ఉంటుంది







- న్యాయవాదుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తాం.
- పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క

**వరంగల్, మార్చి 1 (భద్రాద్రి న్యూస్):** న్యాయాన్ని రక్షించే న్యాయవాదులకు అండగా తెలంగాణ నిలుస్తుందని, న్యాయవాదుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడంలో ముందుంటానని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ తెలంగాణ శాఖ ఆద్వర్యంలో రాష్ట్ర రాజధాని ఖైరతాబాద్ లోని ఇంజనీర్స్ ఇండియా భవనంలో ఐ ఎల్ పి ఎ జాతీయ అధ్యక్షురాలు సుజాత చౌదంటే అధ్యక్షతన జరిగిన మహిళా న్యాయవాదుల రాష్ట్ర సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అవనిలో సగమైన మహిళలు అవకాశాల్లో సగం సాధించలేకపోతున్నారని, 70 ఏండ్ల స్వాతంత్ర భారత దేశంలో మహిళలపై వివక్ష కొనసాగుతూనే ఉందని ఫాతిమా ను జడ్జిగా నియమించిన సందర్భంలో కూడా విమర్శలు చేశారని అన్నారు. ఉన్నత విద్యార్హత, ఉత్తీర్ణతలు ఎన్ని ఉన్నా కులం, మతం, జెండర్ పేరుతో అవకాశాలకు దూరమవుతున్నారని అన్నారు. ఎన్నో సవాళ్లు ఎదుర్కొంటూ న్యాయవ్యవస్థలో మహిళలు రాణిస్తున్నప్పటికీ చట్టపరమైన అవకాశాలు లేకపోవడంతో పాటు పురుషాధిక్య సమాజంలో న్యాయవాదులు, న్యాయమూర్తుల అభివృద్ధి జరగడం లేదని అన్నారు. ప్రజా ఉద్యమాలతో జీవితం ప్రారంభించి న్యాయవాదిగా వృత్తిని ప్రారంభించిన నేను నేడు చట్టసభల్లోకి ప్రవేశించి ఒక గౌరవప్రదమైన మంత్రి పదవి లో కొనసాగుతున్నానని అన్నారు. కొంతమంది రాజ్యాంగ వ్యతిరేకశక్తులు న్యాయ వ్యవస్థను తగ్గించి మాట్లాడుతున్నారని, ఆ విధానం మంచిది కాదని రాజ్యాంగం వల్లనే నాలాంటి వాళ్ళు ఈ స్థాయికి ఎదిగారని అన్నారు. రాజ్యాంగం నాకేమిచ్చిందని అనే వారికి నా జీవితమే సమాధానమని అన్నారు. న్యాయ వ్యవస్థ తెలియని సమాజానికి న్యాయం అందేలాగా, రాజ్యాంగ ఫలాలు సామాన్యులకు అందేలాగా చూడాలనీ అన్నారు. న్యాయవాద రక్షణ చట్టం తదితర అంశాలను ప్రభుత్వ దృష్టికి తీసుకొచ్చి




పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ హై కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఇ తిరుమలదేవి మాట్లాడుతూ మహిళా న్యాయవాదులు న్యాయవాద వృత్తిలో రాణించాలంటే కుటుంబంతో పాటు సమాజం సహకారం అందించాలని, వచ్చిన అవకాశాలను కూడా ఉపయోగించుకొని అభివృద్ధి చెందాలని అన్నారు. అన్ని శక్తులకన్నా స్త్రీ శక్తి గొప్పదని ఆ స్త్రీ సాధికారత కోసం ఇంకా మాట్లాడుకోవడం బాధాకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వినియోగదారుల రాష్ట్ర కమీషన్ చైర్ పర్సన్ జస్టిస్ జి రాధారాణి మాట్లాడుతూ మహిళా సమాజం న్యాయవాద విద్యలో ప్రావీణ్యం సాధిస్తూ, వృత్తిలో మెలుకువలు అభివృద్ధి చేసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. భారత న్యాయ వ్యవస్థలో పితృస్వామ్య సమాజ ఆధిపత్యం కొనసాగుతుండటంతో చాలా అవకాశాలు కోల్పోతున్నారని ఐక్యతతో అవకాశాలు అందిపుచ్చుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఐ ఎల్ పి ఎ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిని నరేందర్ మాట్లాడుతూ న్యాయాన్ని కాపాడే న్యాయవాదులకు రక్షణ లేకుండా పోయిందని, న్యాయవాదుల రక్షణ కోసం 1990 లోనే అంతర్జాతీయ స్థాయిలో జరిగిన కన్వెన్షన్ లో భారతదేశం కూడా పాల్గొన్నదని 35 ఏండ్ల తర్వాత కూడా భారత్ లో న్యాయవధ రక్షణ చట్టం తీసుకురాకోవడం దుర్మార్గమని అన్నారు. రాజస్థాన్, ఛత్తీస్ ఘడ్ రాష్ట్రాల్లో న్యాయవాదుల రక్షణ చట్టం ఏర్పాటు చేయడం జరిగిందని తెలంగాణతో పాటు దేశంలో న్యాయవాద రక్షణ చట్టం కోసం ఐ ఎల్ పి ఎ దేశ వ్యాప్త ఉద్యమం చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఇండియన్ డిఫెన్స్ అకౌంట్స్ సర్వీస్ రిటైర్డ్ అధికారి పి సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ ఉన్నత న్యాయ స్థానాల్లో మహిళలతో పాటు బహుజన న్యాయవాదులకు, న్యాయమూర్తులకు తీరని అన్యాయం జరుగుతుందని, ఈ వివక్షను ఎదుర్కోవడానికి మహిళా న్యాయవాదులు, బహుజన న్యాయవాదులు ఐక్యతతో పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షతన వహించిన ఐ ఎల్ పి ఎ జాతీయ అధ్యక్షురాలు సుజాత చౌదంటే మాట్లాడుతూ తెలంగాణ మహిళా న్యాయవాదుల చైతన్యం గొప్పగా ఉందని, తరతరాల మహిళా వివక్షకు కారణమైన మనుధర్మ శాస్త్రం స్థానంలో అంబేద్కర్ అద్భుతమైన భారత రాజ్యాంగం అందించినప్పటికీ దాన్ని అమలుపరిచే భారత పాలకుల వల్ల మహిళలు అణచివేతకు గురవుతున్నారని, ఆ క్రమంలోనే మహిళా న్యాయవాదుల హక్కులు హరించివేయబడుతున్నాయని అన్నారు.

**తీర్మానాలు :**

సదస్సు అనంతరం ఐ ఎల్ పి ఎ రాష్ట్ర మహిళా కన్వీనర్ టి లక్ష్మీదేవి నాలుగు తీర్మానాలను చదివి న్యాయవాదుల నుండి ఆమోదం పొందారు. 1. రాష్ట్ర ప్రభుత్వ పరంగా నియమించబడే ప్రభుత్వ న్యాయవాది, సహాయక ప్రభుత్వ న్యాయవాది, పబ్లిక్ ప్రాసిక్యూటర్ తదితర పోస్టుల భర్తీ చేసే సమయంలో మహిళా జనాభా నిష్పత్తి ప్రకారం అవకాశాలు కల్పించాలి. 2. న్యాయవాద వృత్తిలో నమోదైన ప్రతి మహిళా న్యాయవాదికి స్త్రీ శిశు సంక్షేమ శాఖ నుండి స్టైఫండ్ ఇవ్వాలి. 3. న్యాయవాద రక్షణ చట్టం తేవాలి. 4. న్యాయవాద శిక్షణ కేంద్రం ఏర్పాటు చేసి అందులో మహిళలకు ప్రాధాన్యత ఇవ్వాలని సదస్సు తీర్మానాలు చేసింది.

ఈ కార్యక్రమంలో ఐ ఎల్ పి ఎ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ జె శాంసన్, గౌరవ అధ్యక్షులు పొన్నం దేవరాజ్ గౌడ్, ఉపాధ్యక్షులు టి లక్ష్మీదేవి, తీగల జీవన్ గౌడ్, పూస మల్లేష్, కృష్ణారెడ్డి, దయాల సుధాకర్, పొడిచేసి శ్రీనివాస్, తౌడబోయిన రేణుక, హుస్న ఖాన్, ఎం సుమలత, ఆంధ్ర ప్రదేశ్ ఐ ఎల్ పి ఎ నాయకులు నూకతోటి రవి కుమార్, తెలంగాణ రాష్ట్ర ఐ ఎల్ పి ఎ నాయకులు చిల్ల రాజేంద్రప్రసాద్, గాంగేగేయుడు, డాక్టర్ తిప్పన్న డాంగే, కె సురేష్, భుజంగరావు, లతా ఆదోని, టి.హేమలత, కర్రె లచ్చన్న, జన్ను పద్మ, కెరీత్ కుమారి, గీతావనజాక్షి, మనీశ్వరి, జ్యోతి గరిగ, సామ హేమలత, ఎస్తేరు, స్వర్ణలత, సమత, పరశురాజ్, వి తిరుపతి, గుగులోతు బద్రు, విజయ, విలాసాగరం సురేందర్ గౌడ్, ఎగ్గడి సుందర్ రామ్, అనిల్, ఎలమాద్రి రవి, పద్మ యాదవ్, శైలజ, అడ్లూరి పద్మ తదితరులు పాల్గొన్నారు.

## హమాలీ కాలనీ ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యం : సర్పంచ్ ప్రేమిందర్

**కొత్తగూడెం రూరల్, మార్చి 1 (భద్రాద్రి న్యూస్) :** హమాలీ కాలనీ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని ఆ గ్రామ సర్పంచ్ గుగులోత్ ప్రేమిందర్ నాయక్ అన్నారు. సమస్యల పరిష్కారంలో దూకుడు ప్రదర్శిస్తున్న ప్రేమిందర్ ను గ్రామస్తులు అభినందనలతో ముంచేత్తుతున్నారు. గత 2 రోజుల క్రితం లో-వోల్టేజి సమస్యను తీరుస్తు అదనపు ట్రాన్సఫార్మర్ ఏర్పాటు చేయడమే కాక గ్రామంలో నూతనంగా విద్యుత్ స్తంబాలు వేయించి వీధి దీపాలు ఏర్పాటు చేయడంతో గ్రామంలో విద్యుత్ వెలుగులు నిండాయి. గత రెండేళ్లుగా లో నోల్టేజి సమస్యతో బాధపడుతున్న గ్రామస్తుల కోసం సర్పంచ్ ప్రేమిందర్ విద్యుత్ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. లక్ష్మిదేవిపల్లి మండలం, హమాలీ కాలనీ పంచాయతీ సర్పంచ్ గా గెలిచిన ప్రేమిందర్ నెల రోజుల్లోనే విద్యుత్తు, తాగునీటి సరఫరా,



పారిశుధ్య పనులను నిర్వహిస్తూ గ్రామస్తుల మన్ననలు పొందారు. గ్రామపంచాయతీ ఖాతాలో డబ్బులు లేకున్నా కూడ తనకున్న పరిచయాలతో నిధులతో సమస్యలు తీరుస్తున్నారు. ఇన్నేళ్లు అభివృద్ధికి దూరమైన హమాలీ కాలనీ గ్రామాన్న ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే తన ధ్యేయమని ఈ సందర్బంగా సర్పంచ్ గుగులోత్ ప్రేమిందర్ నాయక్ అన్నారు.









## శుభ కార్యక్రమాలలో పాల్గొన్న జిల్లా బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు సోయం వీరభద్రం



**దమ్మపేట మార్చి 01 భద్రాద్రి న్యూస్:** దమ్మపేట మండలం జగ్గారం టి.ఎం. గుంపు గ్రామం లో సోయం . మల్లికార్జునరావు నాగమణి కుతురు ధత్రి షాన్విత మొదటి పుట్టినరోజు వేడుక కార్యక్రమంకి హాజరు అయి చిరంజీవి ఆశీర్వదించి.దమ్మపేట అర్బన్ కాలనీ నందు తంబళ్ళ రవి- ఇంధు దంపతుల కుమార్తె తేజేస్వని పుష్పాలంకరణ వేడుక కార్యక్రమంకి హాజరు అయి చిన్నారిని దీవించిన జిల్లా బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు సోయం వీరభద్రం.ఈ కార్యక్రమం లో మాజీ ఎంపీపీ సున్నం లలిత,సోయం ఎర్రయ్య,మురళీమోహన్,వుకే బుల్లిబాబు,పాయం సూర్యం,అశ్వరావుపేట నియోజకవర్గం యువ రాజకీయ నాయకులు వాడే.వీరస్వామి పాల్గొన్నారు.

## ఖమ్మం వెలుగుమట్లలో పేదల ఇండ్ల కూల్చివేతపై నిరసన

***- కారేపల్లిలో అఖిలపక్షాల ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం***

**కారేపల్లి, మార్చి 1 (భద్రాద్రి న్యూస్ రాములు):-**
ఖమ్మం పట్టణ పరిధిలోని ఖమ్మం వెలుగుమట్ల ప్రాంతంలో పేద ప్రజల ఇండ్ల కూల్చివేత ఘటనను నిరసిస్తూ కారేపల్లి మండల కేంద్రంలో అఖిలపక్షాల పార్టీల ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేసి ఆందోళన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా అఖిలపక్ష పార్టీల జిల్లా నాయకులు కొండబోయిన నాగేశ్వరరావు, వై. ప్రకాష్, కే. నరేంద్ర, జీతేజ్ నాయక్, డి. సక్రు, చందు నాయక్ మాట్లాడుతూ--- వెలుగుమట్ల గ్రామంలో దాదాపు పది సంవత్సరాల క్రితం ఎస్.టి, ఎస్.సి, బి.సి, మైనార్టీ వర్గాలకు చెందిన పేద కుటుంబాలు కాయకష్టం చేసి, అప్పులు తీసుకుని, భూములు అమ్ముకొని ఇండ్లు నిర్మించుకుని నివసిస్తున్నారని తెలిపారు. సుమారు 600 కుటుంబాలకు చెందిన రెండు వేల మందికి పైగా అక్కడే జీవనం కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు.2024 ఫిబ్రవరి 24వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం భారీ పోలీసు బలగాలతో తెల్లవారుజామున మూడు గంటల ప్రాంతంలో ఎలాంటి ముందస్తు హెచ్చరికలు, నోటీసులు ఇవ్వకుండా ఇండ్లను కూల్చివేసిందని ఆరోపించారు. ఇంట్లో ఉన్న సామగ్రి, పిల్లల పాఠ్యపుస్తకాలు కూడా తీసుకునే అవకాశం ఇవ్వకుండా మహిళలు, చిన్నపిల్లలు, వృద్ధులను బయటకు పంపించారని అన్నారు. మద్దతుగా నిలిచిన ఉద్యమకారులు, అఖిలపక్ష నాయకులపై అక్రమ అరెస్టులు చేసి కేసులు నమోదు చేశారని విమర్శించారు.ఈ ఘటనకు పూర్తి బాధ్యత రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు జిల్లా మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల



నాగేశ్వరరావు వహించాలని డిమాండ్ చేశారు. వెలుగుమట్ల ప్రాంతంలోని బాధితులకు తక్షణమే ఇళ్ల స్థలాలతో పాటు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నిర్మించి ఇవ్వాలని, ప్రతి కుటుంబానికి లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందించాలని కోరారు. ఇండ్ల నిర్మాణం పూర్తయ్యే వరకు ప్రభుత్వం వసతి, ఆహార సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. లేదంటే బాధిత కుటుంబాలతో పాటు అన్ని వర్గాల ప్రజలను ఐక్యం చేసి ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని, దీనికి పూర్తి బాధ్యత ప్రభుత్వానిదేనని అఖిలపక్ష నాయకులు హెచ్చరించారు.

## రైతు పండించిన పంట రైతుకే

**- వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ హామీ**

**- సీతారామ ప్రాజెక్ట్ భూముల్లో సుబాబుల్ పంటను రైతులే కొట్టుకునేలా చర్యలు తీసుకుంటామని భరోసా**

**కారేపల్లి, మార్చి 1 (భద్రాద్రి న్యూస్ రాములు):-**
సీతారామ ప్రాజెక్ట్ పరిధిలోని భూముల్లో రైతులు పండించిన సుబాబుల్ పంటను రైతులే నేరుగా కొట్టుకునేలా చర్యలు తీసుకుంటామని వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ హామీ ఇచ్చారు.చీమలపాడు గ్రామ సర్పంచ్ మాలోత్ లలిత భావుసింగ్ ఆధ్వర్యంలో రైతులు వైరా ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి తమ ఆవేదనను వ్యక్తం చేశారు. సీతారామ ప్రాజెక్ట్ భూముల్లో సాగు చేసిన సుబాబుల్ పంటను అధికారులే నరుకుతామని చెప్పడం వల్ల రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. రైతులు ఆరుగాలం కష్టపడి చెమటోడ్చి పండించిన పంటను రైతులే తీసుకునేలా అధికారులను ఆదేశించాలని విన్నవించారు.దీనిపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ఇరిగేషన్ అధికారులను పిలిపించి సమస్యపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్‌తో సంప్రదించి సమస్యను పరిష్కరిస్తానని రైతులకు భరోసా ఇచ్చారు. కాల్వ పనులు అడ్డుకోకుండా రైతులు కూడా సహకరించాలని, అయితే రైతుల హక్కులకు ఎలాంటి భంగం కలగకుండా చూస్తామని తెలిపారు.రైతులే సమాజానికి అడ్డుకట్టవలసిన బలమని, రైతు లేనిదే మనం లేమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సుబాబుల్ పంటను కేవలం డబ్బుల కోణంలో కాకుండా రైతుల కష్టానికి ప్రతిఫలంగా చూడాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ అధికారులు నష్టపరిహారంగా రూ.1,38,000 చెల్లించామని, అందువల్ల పంటను తామే నరుకుంటామని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అయితే ఆ మొత్తం కేవలం పెట్టుబడికే సరిపోతుందని, సుబాబుల్ దీర్ఘకాలిక పంటగా ఒక ఎకరానికి ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం రూ.2 లక్షల వరకు ఆదాయం వచ్చే అవకాశముందని రైతులు వివరించారు.ఈ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి ఇరువర్గాలతో చర్చించి రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇవ్వడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.ఎమ్మెల్యేను కలిసిన వారిలో బచ్చలి వెంకటేశ్వర్లు, మాలోత్ స్వామి, గుజ్జర్లపూడి సైదులు, పాటి రాంబాబు, పాటి రామయ్య, గుజ్జర్లపూడి జాను, పాటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



## ఎస్సీ వర్గీకరణ పోరులో అమరవీరులకు జోహార్లు

*– సింగరేణిలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నివాళి కార్యక్రమం*



**కారేపల్లి, మార్చి 1 (భద్రాద్రి న్యూస్ -- రాములు):** సింగరేణి మండల కేంద్రంలోని సినిమా సెంటర్‌లో ఎమ్మార్పీఎస్ గద్దె వద్ద ఆదివారం ఎస్సీ వర్గీకరణ పోరులో ప్రాణత్యాగం చేసిన మాదిగ అమరవీరులకు జోహార్లు అర్పించారు. కార్యక్రమాన్ని గ్రామ శాఖ అధ్యక్షుడు ఆదెర్ల రామారావు, కుల పెద్ద ఆదెర్ల అంజయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు ఇమ్మడి తిరుపతిరావు హాజరై అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ సాధన కోసం పోరాడుతూ ప్రాణాలు అర్పించిన అమరవీరుల త్యాగం వృథా కాదని, వారి ఆశయ సాధనకు కట్టుబడి ఉండాలని పిలుపునిచ్చారు. ఎస్సీలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేందుకు వర్గీకరణ అవసరమని పేర్కొన్నారు. అనంతరం ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు నాగేంద్రబాబు మాట్లాడుతూ అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడం బాధాకరమని, ఎస్సీ వర్గీకరణ ద్వారా మాదిగల జీవనోపాధి, అభివృద్ధికి దోహదం జరుగుతుందని తెలిపారు. వర్గీకరణ సాధన దిశగా ఐక్యంగా ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు నాగేంద్రబాబు, కుల పెద్ద ఆదెర్ల అంజయ్య, గ్రామ శాఖ అధ్యక్షుడు రామారావు, జిల్లా నాయకుడు ఇమ్మడి తిరుపతిరావు, ఆదెర్ల ఉపేందర్, గజ్జల శ్రీను, అంజయ్య, ప్రసాద్, సాంబ, మహిళా నాయకురాలు అరుణ, గురువమ్మ తదితరులు పాల్గొన్నారు.

## మాదారం గ్రామ శాఖ రద్దు కాలేదు

**-- సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ స్పష్టం**

**సమాచార లోపంతో వచ్చిన అపోహలు**

**-- సంయుక్త మండల సమావేశంలో వివరణ**



**కారేపల్లి, మార్చి 1(భద్రాద్రి న్యూస్ రాములు):**
సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ ఖమ్మం విభాగ నాయకత్వంపై ఇటీవల సామాజిక మాధ్యమ సమూహాలలో ప్రచారంలోకి వచ్చిన ప్రకటనలపై పార్టీ స్పష్టత ఇచ్చింది. ఉద్యమ అవసరాల దృష్ట్యా ప్రజలను కలిసే సమయంలో కొంత సమాచార లోపం, పరస్పర అవగాహన లోపం కారణంగా మాదారం గ్రామానికి చెందిన కొందరు కార్యకర్తలపై “పార్టీకి సంబంధం లేకుండా తిరుగుతున్నారు” అనే సందేశం ప్రసారమైంది. ఈ విషయంపై విభాగ, మండల నాయకత్వం మాదారం గ్రామంలో సమావేశం నిర్వహించింది. విచారణ అనంతరం ఆ ప్రకటన సమాచార లోపం వల్లే వెలువడినదని పార్టీ గుర్తించింది. మాదారం గ్రామంలో ప్రజలను కలిసిన వారు పార్టీ నిర్ణయం ప్రకారమే కార్యక్రమాలు నిర్వహించినట్లు స్పష్టం చేసింది. మాదారం గ్రామ శాఖను రద్దు చేసినట్లు ప్రచారంలోకి వచ్చిన వార్తలు పూర్తిగా అసత్యమని నాయకులు తెలిపారు. గ్రామ శాఖ యథావిధిగా కొనసాగుతోందని వెల్లడించారు. పులకాని సత్తిరెడ్డి అధ్యక్షతన జరిగిన కారేపల్లి--కామేపల్లి సంయుక్త మండల సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఆవుల అశోక్, కోలేటి నాగేశ్వరరావు, ఖమ్మం విభాగ కార్యదర్శి టి. ఝాన్సీ, జిల్లా నాయకులు కె. శ్రీనివాస్, విభాగ కార్యదర్శి గుమ్మడి సందీప్, సహాయ కార్యదర్శి ఎన్.వి. రాకేష్, విభాగ కార్యవర్గ సభ్యులు తేజ నాయక్, బిక్కసాని భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. పార్టీ అంతర్గతంగా సమస్యను పరిష్కరించుకున్నామని, ఇకపై ఇలాంటి అపోహలు రాకుండా పరస్పర సమన్వయాన్ని మరింత బలపరుస్తామని నాయకులు తెలిపారు.

## పాల్వంచలో దొంగల హల్చల్

**– నెట్ సెంటర్, సెల్ షాపులే టార్గెట్**

**పాల్వంచ, మార్చ్ 1(భద్రాద్రి న్యూస్):-**
పాల్వంచలో దొంగలు పెట్రేగి పోయారు. నెట్ సెంటర్, సెల్ షాప్ లే టార్గెట్ గా శనివారం రాత్రి రెచ్చిపోయారు. డీఎస్పీ, సర్కిల్ ఇన్స్పెక్టర్, పోలీస్ స్టేషన్కు కూతవేటు దూరంలోగల బస్టాండ్ ప్రాంత షాపులను లూటీ చేశారు. సుమారు రూ 15 వేల నగదు తో పాటు సెల్ఫోన్లను ఎత్తుకెళ్లినట్లు తెలుస్తోంది. బాధితులు ఆదివారం పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

## పెద్దమ్మ గుడికి భక్తుల తాకిడి

**పాల్వంచ, మార్చ్ 1(భద్రాద్రి న్యూస్):-**
కేపీ జగన్నాధపురం శ్రీ కనకదుర్గ ( పెద్దమ్మ తల్లి ) దేవాలయానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం సెలవు దినం కావడంతో.. ఆలయ సమీప ప్రాంత ప్రజలతోపాటు ఉమ్మడి ఖమ్మం సరిహద్దు రాష్ట్రవ్యాప్తంగా నలుమూలల నుండి భక్తులు పిల్లాపాపలతో ఆలయానికి చేరుకున్నారు. మొక్కులు చెల్లించుకున్నారు. బోనాలు సమర్పించారు. విశేష పూజల అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణాధికారి రజనీకుమారి, ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

## కొత్త పీఆర్సీని అడ్డుకోవడమే విద్యా కమిషన్ రిపోర్ట్ ఉద్దేశం

**-- పీవైఎల్ రాష్ట్ర నాయకులు భూక్య శివా నాయక్ ధ్వజం**

**కారేపల్లి, మార్చి 1 (భద్రాద్రి న్యూస్ రా ములు ):-**
కొత్త పీఆర్సీ అమలును అడ్డుకోవడమే విద్యా కమిషన్ రిపోర్ట్ ప్రధాన ఉద్దేశమని పీవైఎల్ ప్రగతిశీల యువజన సంఘం తెలంగాణ రాష్ట్ర నాయకులు భూక్య శివా నాయక్ తీవ్రంగా మండిపడ్డారు. కారేపల్లి హెడ్ క్వార్టర్ నుండి విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, విద్యా కమిషన్ చైర్మన్ అకునూరి మురళి సమర్పించిన రిపోర్ట్ ఉపాధ్యాయులను అవమానించేలా ఉందని విమర్శించారు. ఉపాధ్యాయుల సాలరీలు, అర్హతలపై అశాస్త్రీయ వ్యాఖ్యలు చేయడం సరికాదని, వాస్తవ పరిస్థితులను పరిగణలోకి తీసుకోకుండా రిపోర్ట్ ఇవ్వడం బాధాకరమన్నారు. ఇప్పటికే మండల, జిల్లా స్థాయిలో పర్యవేక్షణ పోస్టులు ఖాళీగా ఉండి ఇన్‌చార్జ్ వ్యవస్థతోనే నడుస్తున్నాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు పదిహేడు వందల మంది ఉపాధ్యాయులు డిప్యూటేషన్‌పై ఉండటంతో పాఠశాలల్లో బోధన దెబ్బతింటోందని ఆందోళన వ్యక్తం చేశారు. అనేక ప్రాథమిక పాఠశాలల్లో ఒక్కరు లేదా ఇద్దరు ఉపాధ్యాయులే ఐదు తరగతులకు గాను పద్దెనిమిది సబ్జెక్టులు బోధించాల్సిన పరిస్థితి నెలకొన్నదని, ఇలాంటి పరిస్థితుల్లో విద్యా బోధన ఎలా మెరుగవుతుందో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమాజం కార్పొరేట్ విద్య మాయలో పడిపోవడంతో తల్లిదండ్రుల ఆలోచనా విధానం మారిపోయిందని, పిల్లలను ఐఐటీ, ఎయిమ్స్, ఎన్‌డీఏ వంటి ఉన్నత విద్యాసంస్థల్లో చదివించాలని ఆశపడుతున్నారని పేర్కొన్నారు. అయితే ప్రభుత్వ పాఠశాలల్లో ఆ స్థాయి సిలబస్, పాఠ్యపుస్తకాలు అందుబాటులో లేవని, అలాంటి అంశాలపై రిపోర్ట్ ఇవ్వకుండా ఉపాధ్యాయుల సాలరీలపై మాత్రమే దృష్టి పెట్టడం విడ్డూరమన్నారు. జీతాలు నిత్యావసర ధరలు, జీవన ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని, ప్రస్తుత పరిస్థితుల్లో వేతన జీవుల పరిస్థితి దయనీయంగా మారిందని అన్నారు. రిపోర్ట్ సమర్పించే ముందు సీనియర్ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులతో చర్చించి ఉండాల్సిందని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఎక్కువగా ఎస్సీ, ఎస్టీ, పేద వర్గాల విద్యార్థులే చదువుతున్నారని, హాజరు పెంచేందుకు తీసుకొచ్చిన విధానాలను ఉపాధ్యాయ సంఘాలు స్వాగతించాయని తెలిపారు. అయితే ఎఫ్ఆర్ఎస్ అమలులో కొంత వెసులుబాటు ఇవ్వాలని, వ్యక్తిగత ఇబ్బందులు, ఆరోగ్య సమస్యలతో ఇన్‌టైమ్ హాజరు విషయంలో ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. గురుకులాలు, రెసిడెన్షియల్ స్కూల్స్ పెరగడంతో మండల, జిల్లా పరిషత్ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గడం సహజమని, అయినప్పటికీ ఉపాధ్యాయులపై నిందలు మోపడం తగదన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో బోధించే ఉపాధ్యాయులకు ఎంఎస్సీ బిఎడ్ అర్హత తప్పనిసరి చేయాలనే సూచనలు ఇవ్వడం సరైనది కాదని, ఎన్‌సీటీఈ నార్మ్స్ ప్రకారం వాస్తవ పరిస్థితులు పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వానికి పీవైఎల్ రాష్ట్ర కమిటీ తరఫున పలు డిమాండ్లు చేస్తున్నామని తెలిపారు. నలభై ఐదు శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీని వెంటనే అమలు చేయాలని, ప్రతి ప్రాథమిక పాఠశాలలో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేలా చూడాలని, విద్యార్థుల సంఖ్య ఆధారంగా అదనపు పోస్టులు మంజూరు చేయాలని కోరారు. డీఏ, మెడికల్, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెండింగ్ బిల్లులు క్లియర్ చేయాలని, గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న పండిట్, పీఈటీ పోస్టులను అప్‌గ్రేడ్ చేసి ప్రమోషన్లు ఇవ్వాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కేజీబీవీ, గురుకులాలు, ఎంఆర్సీ, ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్



చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎస్, యూపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలని, రెండు వేల ఎనిమిది డీఎస్సీకి ముందు నియామకం పొందిన ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని, ప్రతి ప్రాథమిక పాఠశాలలో పీఎస్ హెచ్‌ఎం పోస్టు మంజూరు చేయాలని కోరారు. ఉపాధ్యాయులను విమర్శించడం కాకుండా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే చర్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలని పీవైఎల్ రాష్ట్ర నాయకులు భూక్య శివా నాయక్ కోరారు.

## భిమ్లా తండాలో మైనర్ బాలిక కిడ్నాప్

**- భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మైనర్ బాలిక కిడ్నాప్**

**-- బలవంతపు వివాహం కేసు సంచలనం**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం మార్చి 1 భద్రాద్రి న్యూస్ రిపోర్టర్. యూసఫ్:**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండల పరిధిలోని పాపకొల్లు గ్రామపంచాయతీ భిమ్లా తండాలో మైనర్ బాలిక కిడ్నాప్ చేసి బలవంతంగా వివాహం జరిపిన ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. గ్రామానికి చెందిన గూగులోత్ బాలు మైనర్ కుమార్తె ను అదే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు అపహరించి బలవంతపు వివాహం చేసినట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. బాధిత కుటుంబం తెలిపిన వివరాల ప్రకారం, వాంకుడోత్ భీమేష్, భుఖ్యా వీరన్న ప్రమేయంతో భుఖ్యా నాగేంద్రబాబు (తండ్రి: భుఖ్యా లక్కు) అనే వ్యక్తి బాలికను కిడ్నాప్ చేసి వివాహం చేసుకున్నట్లు వెల్లడించారు. ఈ ఘటనపై ఇప్పటికే జూలూరుపాడు పోలీస్ స్టేషన్‌లో కిడ్నాప్ కేసు నమోదు చేసి ఎఫ్ ఐ ఆర్ చేసినట్లు సమాచారం. అయితే కేసు నమోదైన తరువాత మరింత సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. అదే గ్రామానికి చెందిన వాంకుడోత్ హతీరం (తండ్రి: వాంకుడోత్ కితా) బాలికతో ఫోన్‌లో మాట్లాడి, విచారణలో కొందరి పేర్లు చెప్పొద్దని, కేసు దిశ మారేలా సూచనలు ఇచ్చినట్లు ఆరోపణలు వచ్చాయి. బాలికను గందరగోళానికి గురిచేస్తూ, ఎవరిపై ఏమి చెప్పాలో నేర్పించే ప్రయత్నం జరిగినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.
ఈ సంభాషణలకు సంబంధించిన వీడియో, ఆడియో ఆధారాలు తమ వద్ద ఉన్నాయని బాధితురాలి తండ్రి గూగులోత్ బాలు వెల్లడించారు. ఇప్పటికే ఎఫ్ఐఆర్‌లో ఉన్న ముగ్గురు నిందితులతో పాటు బాలికను ప్రభావితం చేయడానికి ప్రయత్నించిన వ్యక్తిపై కూడా కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన పోలీసులను కోరుతున్నారు. స్థానిక ప్రజలు ఈ ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, మైనర్ బాలిక హక్కులను రక్షిస్తూ నిందితులపై పోక్సో చట్టం సహా కఠిన సెక్షన్లు నమోదు చేసి శిక్షించాలని డిమాండ్ చేస్తున్నారు. పోలీసులు కేసును దర్యాప్తు చేస్తూ, అన్ని




కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నట్లు సమాచారం.

## వైభవంగా శ్రీ పార్వతి సమేత రామలింగేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం

**- భక్తి చాటుకున్న యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు రామ్ రెడ్డి చరణ్ రెడ్డి**

**కామేపల్లి,మార్చి1 (భద్రాద్రి న్యూస్):-**
కామేపల్లి మండల పరిధిలోని కొండాయిగూడెం, కొమ్మినేపల్లి, పండితాపురం గ్రామాల్లో వెలసిన శ్రీ పార్వతి సమేత రామలింగేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఈ ఆధ్యాత్మిక వేడుకలో భాగంగా నిర్వహించిన పూర్ణహుతి. తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాల్లో తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు రాంరెడ్డి చరణ్ రెడ్డి, రాష్ట్ర నాయకులు రాంరెడ్డి కృష్ణారెడ్డి, విశిష్ట అతిథులుగా పాల్గొన్నారు. ?ఆధ్యాత్మిక శోభతో పులకించిన గ్రామాలు? ఫాల్గుణ శుద్ధ త్రయోదశి పుణ్యఘడియల్లో స్వామివారికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చరణ్ రెడ్డి, స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జరిగిన పూర్ణహుతి కార్యక్రమంలో పాల్గొని, వేద పండితుల ఆశీర్వాదం పొందారు. గ్రామస్తులందరికీ స్వామివారి కృపాకటాక్షాలు మెండుగా ఉండాలని, గ్రామ ప్రజలు పాడి పంటలు పశువులు అని సుఖసంతోషాలతో శ్రీ పార్వతి రామలింగేశ్వర స్వామి వారి చల్లని దీవెనలు ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ?భక్తులకు తీర్థ ప్రసాద వితరణ?కళ్యాణ మహోత్సవం అనంతరం భక్తులకు భారీ ఎత్తున తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ వేడుకను చూడటానికి పరిసర గ్రామాల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. గ్రామాల్లో ఆధ్యాత్మిక పండగ వాతావరణం నెలకొంది. ?”మన సంస్కృతి, సంప్రదాయాలకు నిలువెత్తు అని ఈ శివాలయం ఉత్సవాలే ప్రతిబింబమని పేర్కొన్నారు పండితాపురం, కొమ్మినేపల్లి గ్రామాల్లో స్వామివారి కళ్యాణంలో పాల్గొనడం నా అదృష్టంగా భావిస్తున్నాను. రాంరెడ్డి చరణ్ రెడ్డి, పేర్కొన్నారు. ?ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌లు, ఉప సర్పంచ్ మేకల మల్లికార్జునరావు గ్రామ ప్రముఖులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ఆలయ అర్చకులు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఉత్సవ కమిటీ



సభ్యులు అతిథులను ఘనంగా చరణ్ రెడ్డిని స్వాగతం పలికి సత్కరించారు. తదితరులు పాల్గొన్నారు.

## తుల్జా భవాని ఆలయంలో భోగ్ బండారో

**- విశిష్ట పూజల్లో సాధుసంతులు**

**పాల్వంచ, మార్చ్ 1(భద్రాద్రి న్యూస్):**
పట్టణ పరిధి కే ఎస్ పి రోడ్ భారత్ పెట్రోల్ బంక్ ఎదురు శ్రీ జగదాంబ దేవి తుల్జా భవాని ఆలయంలో బుడియా బాపు వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భోగ్ బండారో కార్యక్రమాన్ని ఆదివారం జగదంబ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు తేజావత్ రాములు మహారాజు ఆధ్వర్యంలో చేపట్టారు. సాధుసంతులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాములు నాయక్ మాట్లాడుతూ.. ప్రతి తండా, గూడేల్లో సేవాలాల్ మహారాజ్, బుడియా బాపు మహారాజ్, హాథిరాం మహారాజ్, భాసం భావ మహారాజ్, లింగ బాచియా మహారాజ్ సేవలను రాష్ట్ర వ్యాప్తంగా విస్తృత ప్రచారం నిర్వహించాలని కోరారు. జెండాల ద్వారా ప్రత్యేక కార్యాచరణతో గూడాలకు తరలాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జేఏసీ వైస్ చైర్మన్ వీరు నాయక్, కేశవ నాయక్, గణేష్ మహారాజ్, కాశీ



రామ్ మహరాజ్, శంకర్ సాదు, బదియాసాదు, సోముల సాదు, సురేష్, నిరోషా బాయ్, కిషోర్ బాయ్, తేజావత్ కుమార్ నాయక్, జాటోత్ కుమార్ నాయక్, సాధువులు, మహిళలు, యువకులు పాల్గొన్నారు

Printed, Published and Owned by CHENGAPONGUSAIDULU,and printed at KAKATI BABU PRINTERS H No.4-10.Telagarama varam,Laximidevipally, Kothagudem -507101,Dist .Bhadradri kothagudem, Telangana. And Published At HNo. DA-416,Babu camp,chunchupalli (M), Kothagudem-507101,Dist Bhadradri kothagudem, Telangana.Editor: CHENGAPONGU SAIDULU. RNI TELTEL 2023/90682Call No.6302329046